
ఆదివారం

ఆంధ్రజ్యోతి

2 అక్టోబర్ 2016



మ హా త్మా..

ఈ అనా[illegible]ల పుట్టినరోజు కూడా నేడే





‘సీక్వెల్’ హీరోయిన్లు

ఫిల్మ్‌నగర్



ఒక సినిమా హిట్టయితే దాని సీక్వెల్‌లో హీరోతో పాటు మిగతా నటీనటులు కంటిన్యూ అవుతుంటారుగానీ హీరోయిన్‌ను మాత్రం ఎందుకో మారుస్తుంటారు. ఉదాహరణకు మున్నాభాయ్, ఇష్కియా, రాజ్, మర్డర్, రేస్... ఇలా చాలా సీక్వెల్స్ ఉన్నాయి. అయితే సీక్వెల్‌లో కూడా ఛాన్స్ దక్కించుకున్న లక్కీ హీరోయిన్లు కొందరున్నారు. ప్రస్తుతం నిర్మాణదశలో ఉన్న ‘కహానీ2’లో విద్యాబాలన్, ‘బేబీ2’లో తాప్సీలు తిరిగి నటిస్తుండగా... ‘ఏక్ థా టైగర్’, ‘రాక్ ఆన్’, ‘ఫక్రీ’ సీక్వెల్స్‌లో వరుసగా కత్రినాకైఫ్, సుహానా గోస్వామి, ప్రాచీ దేశాయ్ (‘రాక్ ఆన్’లో ఇద్దరున్నారు), రిచా చద్దాలు మరోసారి కనిపించనున్నారు. “ సాధారణంగా ఒక సినిమా బాక్సాఫీసు దగ్గర హిట్టయితేనే దాని సీక్వెల్ వస్తుంది. దర్శకులు ఆయా సినిమాల సక్సెస్‌లో హీరోయిన్ పాత్ర కూడా ఉందని గుర్తించి వాళ్లను వాటి సీక్వెల్స్‌లో తీసుకుంటున్నందుకు వారికి నిజంగా కృతజ్ఞతలు చెప్పాల్సిందే” అంటోంది ‘ఫక్రీ’ సీక్వెల్‌లో నటిస్తున్న రిచాచద్దా.







ఇండెక్స్



ఆదివారం ఆంధ్రజ్యోతి
2 అక్టోబర్ 2016

ఇన్‌బాక్స్



అంతరాలను ఆవిష్కరించిన కథ

మానస కథ 'బొట్టు భోజనాలు' చాలా నచ్చింది. కులాలు, మతాలు, ఆర్థిక అసమానత్వం అన్నీ మనుషుల్ని విడదీసేవే. మార్తమ్మ పాత్ర గుర్తుండిపోతుంది. మంచి మనసు, వాస్తవంపై అవగాహన ఉన్న పాత్ర అది. మనుష్యులను ముందర ఆర్థిక అంతరాలు విడదీస్తాయి. ఆ తరువాతే కులాలు, మతాలు విడదీస్తాయి. ఆ విషయం కథలో బలంగానే వచ్చింది అని నేను అనుకుంటున్నాను.

- శర్మ కందుల, ఈమెయిల్

•••

ఈ వారం కథ 'బొట్టు భోజనాలు' మతాలు, కులాలు మనుషుల మధ్యలో ఎన్ని చీలికలను తెస్తున్నాయో తెలియజేసింది. ఉన్నత చదువులు చదివి బాధ్యతగల ఉద్యోగం చేసేవారిలో కూడా కులాల కుళ్లు ఎంతగా ఉంటుందో చాలా చక్కగా తెలియజేశారు.

- అంబడిపూడి శ్యామసుందరరావు, గుంటూరు

•••

ఈ వారం కథ నిజానికి దూరంగా ఉన్నట్టుగా అనిపించింది. ఒక హిందువుగా నేను ఎన్నో క్రిస్టియన్ పార్టీలకు వెళ్లాను. ఎటువంటి భేషజాలకు పోకుండా వాళ్ల ఇంట్లో భోజనం చేశాను. వాళ్ల ప్రసాదం తినకపోయినా నేను పట్టించుకోలేదు. ఇలాంటి సున్నితమైన అంశాలను కథా వస్తువుగా తీసుకునేటప్పుడు చాలా జాగ్రత్త అవసరం.

- ఎం. సుధాకర్ రెడ్డి, రాయవరం

•••

ఈ వారం మానస ఎండ్లూరి కథ వైరుధ్యపూరితమైన అంశాన్ని స్పృశించింది. వద్దని మొహం మీద చెప్పడం ఒకరికి సంస్కారమైతే, రానని చెప్పలేక లౌక్యంగా తప్పుకోవడం ఇంకొకరి సంస్కారమైంది. యేసుక్రీస్తు పుట్టకముందే ఆకలితో అలమటించే వారికి సాయపడడమే దైవత్వం అని తెలిపిన దేశం మనది.

-టి. పావెల్, విజయవాడ

పచ్చబొట్టు సంతకం బాగుంది

'టాటూ ఎ న్యూ సిగ్నేచర్' కవర్‌స్టోరీ సరికొత్తగా అనిపించింది. పచ్చబొట్టేసిన పిల్లగాడితో ప్రేమను పంచుకుంది ఓ యువరాణి(బాహుబలి). అక్కడ ప్రేమకు సంతకం అయింది పచ్చబొట్టు. స్నేహితులు తమ స్నేహాన్ని చాటుతూ పచ్చబొట్టు పొడిపించుకుంటారు. తండ్రి పేరును, తల్లి పేరును టాటూగా వేయించుకునేవారు వేలల్లో ఉంటారు. మాటల్లో తెలుపలేని భావాలను కూడా తెలియజేసే టాటూ నిజంగా ఓ సరికొత్త సంతకమే! పచ్చబొట్టు చెదిరిపోదులే.. అని ఓ కవి అన్నట్టు ఈ సంతకం కూడా జనం మదిలోంచి ఎప్పటికీ చెదిరిపోదు.

- ఘట్టమనేని మధుసూదన్, విజయవాడ

'మదర్ సిటీ..' బ్యూటిఫుల్

'ట్రావెలోకం'లో దక్షిణాఫ్రికా టూర్ విశేషాలు బాగున్నాయి. అక్కడి అందమైన దృశ్యాలను కళ్లకు కట్టినట్టు చూపించారు. దక్షిణాఫ్రికాలో నల్లవాళ్లు, తెల్లవాళ్లు ఉన్నారని తెలుసు కానీ రంగువాళ్లు, ఇండియన్/ఏషియన్ అనే కేటగిరీలు కూడా ఉన్నాయని తెలియదు. 'మదర్ సిటీ.. మహా సౌందర్యవతి' శీర్షిక చాలా బాగుంది.

- స్నిగ్ధ సహస్ర, ఢిల్లీ

గుర్తుకొచ్చాయి

'రైలు కథలు' చదువుతుంటే రైలులో ప్రయాణించినప్పుడు నాకు కలిగిన అనుభవాలు, అనుభూతులన్నీ గుర్తుకొచ్చాయి. రాక్షస కేక వేస్తున్నట్టుగా కూత కూస్తూ వచ్చే రైలులో ప్రయాణం ప్రతీసారి ఎన్నో అనుభూతులను మిగులుస్తుంది. రైల్వేశాఖ మన అనుభూతులను ఒక్కచోటికి చేర్చేందుకు ట్విట్టర్‌ను వేదికగా మలుచుకోవడం అభినందనీయం.

- ఇమ్రాన్ ఖలీద్, తాడికొండ

సరదాగా సాగింది

'వైఫ్ ఈజ్ లైఫ్' కథనం చాలా బాగుంది. కుటుంబం కోసం తన అభిరుచులను, ఆశయాలను వదులుకునే ఆడవారిని అభినందించేందుకు 'భార్యా ప్రశంసా దినోత్సవం' అని ఒక రోజు ఉందని తెలిసి ఆశ్చర్యపోయాం.

- కిరణ్‌కుమార్, హైదరాబాద్

'ఆదివారం అనుబంధం'పై మీ అభిప్రాయాలను శుక్రవారంలోగా అందేలా పంపగలరు. ఆలస్యంగా అందిన ఉత్తరాలు ప్రచురించడం సాధ్యపడదని మనవి. sunday.aj@gmail.com కి మీ ఉత్తరాల్ని మెయిల్ చేయవచ్చు.



చాదర్‌ఘాట్



లంగర్‌హౌస్



లండన్‌లో...



ఢిల్లీలో...

హైదరాబాద్

సైనిక వీరుల స్మృతులు

మొదటి, రెండవ ప్రపంచ యుద్ధాలలో పాల్గొని అమరులైన భాగ్యనగర సైనికులు ఎందరో! వారి ప్రాణత్యాగానికి గుర్తుగా నగరంతోపాటు ఢిల్లీ, లండన్‌లలోనూ స్మారక చిహ్నాలు నెలకొల్పారు నాటి పాలకులు.

ఛాదర్‌ఘాట్ స్మారక స్థూపం

ఛాదర్‌ఘాట్‌లోని విక్టోరియా మైదానం కుడివైపున నిలువెత్తు రాతి స్థూపం కనిపిస్తుంది. అది మొదటి ప్రపంచ యుద్ధంలో ప్రాణాలొదిలిన హైదరాబాద్ సైనికుల స్మారక చిహ్నం. 1914-1919 మధ్య జరిగిన మొదటి ప్రపంచ యుద్ధంలో బ్రిటిషు సైన్యానికి మద్దతుగా నిజాం రాజ్యం నుంచి ఎంతో మంది సైనికులు రణరంగానికి వెళ్ళారు. 'ఎంత మంది ఆ యుద్ధంలో పాల్గొన్నారో, ఎంతమంది మరణించారో ఇవాళ్టికీ సరైన సమాచారం లేదు' అని చెప్పారు 'ఇన్‌ట్యాక్' కో కన్వీనర్ పి. అనూరాధారెడ్డి. ఆ యుద్ధంలో అమరులైన సైనికుల జ్ఞాపకార్థం 1920లో హైదరాబాద్ రెసిడెన్షియల్ బజార్ వాసులు ఈ స్థూపాన్ని ఏర్పాటుచేసినట్లు అక్కడున్న వివరాల ద్వారా తెలుస్తుంది. తెలుగు, ఇంగ్లీషు, ఉర్దూ, కన్నడ నాలుగు భాషలలో ఆ స్థూపానికి నలుదిక్కులా స్మారక ఫలకాలున్నాయి. 'లెస్ట్ వుయ్ ఫర్‌గెట్', (యుద్ధభూమిలో ప్రాణాలొదిలిన మిమ్మల్ని మరవకుండా ఉండేందుకే ఈ చిహ్నం) అని రాసివున్న రాతి ఫలకం మధ్యలో కొలువుదీరి ఉంటుంది.

లంగర్‌హౌస్ స్మారక చిహ్నం

గోల్కొండ బ్రిడ్జి కుడివైపున ఉంటుంది నిజాం 2వ హైదరాబాద్ ఇంపీరియల్ సర్వీస్ ల్యాంసర్స్(నిజాం సొంత సైన్యం) కంటోన్మెంట్ ప్రాంతం. దాన్ని ఆ రోజుల్లో ఉర్దూలో చావ్‌నీ మొహ్మదీ అని పిలిచేవారు. అక్కడ పెద్ద రాతి స్థూపం ఒకటి దర్శనమిస్తుంది. రెండు ప్రపంచ యుద్ధాలలో పాల్గొని ప్రాణాలర్పించిన వారి స్మారకంగా నిర్మించిన స్థూపం అది. హైదరాబాద్ సైన్యం పాత్రను భావితరాలకు తెలిపేందుకు ఎరిక్ మెరియట్ అనే ఆర్కిటెక్ట్ ఆధ్వర్యంలో ఆ స్థూపాన్ని నిర్మించారు. 2వ ల్యాంసర్స్ పాలస్తీనా, ఈజిప్ట్ దేశాలకు క్యాంపెయిన్‌కు వెళ్లినట్లు ఆ స్థూపం మధ్యభాగంలోనున్న చిన్న ఫలకంలోని గుర్తులు తెలుపుతాయి. 19వ శతాబ్దం చివరలో ఆ సైనిక బృందానికి సర్ అఫ్సర్ ఉల్ ముల్క్ కమాండర్ ఇన్ చీఫ్ గా పనిచేశారు. 1895లో హాసిమ్ నవాజ్ జంగ్ బహదూర్ కమాండంట్‌గా వ్యవహరించారు. 2వ ల్యాంసర్స్ ప్రారంభమైన సంవత్సరం 1893 నుంచి నాయకత్వం వహించిన కమాండెంట్ల పేర్లు, సంవత్సరాలతో సహా 2వ ల్యాంసర్స్ రద్దు అయిన 1950 వరకు వివరాలన్నీ ఆ చలువరాతి ఫలకంలో పొందుపరిచారు.

లండన్‌లో మన హైదరాబాదీ ఆర్మీ గుర్తులు


రెండు ప్రపంచ యుద్దాలలో అసువులు బాసిన భారత దేశ అశ్వికదళానికి (కావెలరీ) గుర్తుగా తెల్లదొరలు లండన్‌లోని హైడ్‌పార్కులో ఒక చిహ్నం నిర్మించారు. ప్రధాన చిత్రంలో గుర్రంపై కూర్చున్న ఒక సైనికుడు, విగ్రహం కింది భాగంలో ప్రపంచ యుద్ధాలలో పాల్గొన్న భారతదేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన అశ్విక దళాల గుర్తులు గల తామ్ర ఫలకం ఉంటాయి. అందులో గ్వాలియర్, మైసూర్, జోధ్‌పూర్, కాశ్మీర్, పాటియాలా, హైదరాబాద్ మొదలైన రాజ సంస్థానాల సొంత సైన్యం గుర్తులను పొందుపరిచారు. 1961లో కొన్ని కారణాల వల్ల ఈ స్థూపాన్ని గ్రేట్ స్టాన్‌హోప్ స్ట్రీట్‌కు తరలించారు.

ఢిల్లీలో తీన్ మూర్తి

మొదటి ప్రపంచ యుద్ధంలో బ్రిటిషు సైన్యంతోపాటు మైసూరు, జోధ్‌పూర్, హైదరాబాద్ రాజ్య సైన్యాలు సమరానికి కదిలి జర్మనీతో పోరు సలిపాయి. ఆ పోరులో ఎంతోమంది అసువులు బాశారు. వారి పోరాట పటిమకు గుర్తుగా బ్రిటిషు పాలకులు 1922లో ఢిల్లీలో హైదరాబాద్, మైసూర్, జోధ్‌పూర్ సైనికదళాలకు గుర్తుగా మూడు విగ్రహాలతో కూడిన ఒక తెల్ల రాతి స్థూపాన్ని నిర్మించారు. హైదరాబాద్ సైనికుడి విగ్రహం నడుముకున్న బెల్టు బకెల్ నిజాం సైన్యం గుర్తును సూచిస్తుంది. తర్వాత అక్కడే 1930లో ఆర్కిటెక్ట్ రాబర్ట్ రసూల్ పర్యవేక్షణలో ఒక అందమైన భవనాన్ని నిర్మించారు. అదే తీన్‌మూర్తి భవనం. 30 ఎకరాల ఆ భవనమే బ్రిటిషు చీఫ్ కమాండర్ అధికారిక నివాస గృహం. భారతదేశానికి స్వాతంత్రం వచ్చిన తర్వాత జవహర్‌లాల్ నెహ్రూ తీన్‌మూర్తి భవన్‌లోనే నివసించారు. ఆయన తుది శ్వాసవిడిచింది కూడా తీన్‌మూర్తిభవనంలోనే. తర్వాత కాలంలో ఆ భవనం నెహ్రూ స్మారక మ్యూజియం, లైబ్రరీగా మారింది. ఆ రోడ్డుకు, భవనానికి తీన్‌మూర్తిగా పేరు రావడానికి కారణం ఈ ముగ్గురు సైనికుల విగ్రహాలే! అందులో ఒక విగ్రహం హైదరాబాదీ సైన్యానికి చిహ్నం కావడం విశేషం.

- కె. వెంకటేష్, ఆంధ్రజ్యోతి





('మంచిరోజులొచ్చాయి' చిత్రంలోని 'నేలతో నీడ అన్నది .. నను తాకరాదని' పాటకు)

చాయితో కప్పు అన్నది నను తాకరాదని
కప్పుతో లిప్పు అన్నది నను తాకరాదని
నిప్పు తనని తాకరాదని చాయి కెటిలు అన్నది
నేడు చాయినే తాకరాదని ఒక గొంతు అన్నది

నిప్పుపైన పెట్టనిదే చాయి తయారయ్యేనా
పెదవి తనని తాకనిదే చాయి గొంతు దిగియేనా

పేరడీ



కప్పు, పెదవి ఒకరినొకరు తాకనిదే
చాయి లేదు మజా లేదు ..
చాయి లేదు మజా లేదు - ఉత్తేజమే లేదులే

బ్రష్షు కొసలు తాకనిదే గార పళ్ల మెరిసేనా
తాంబూలం తాకనిదే నోరు ఎరుపు పండేనా
కత్తి, జుత్తు ఒకరినొకరు తాకనిదే
షేపు లేదు షోకు లేదు ..
షేపు లేదు షోకు లేదు - అందమే లేదులే

మారలేని తనము తుంటరి తనము
అనాదిగా అన్నిటికీ అదే మొండితనము
ఇక సమభావం, సమధర్మం సహజీవనమనివార్యం
తెలుసుకొనుట మీ ధర్మం
తెలియకుంటె మీ కర్మం ..

- **మాధవీ సనారా**, అనకాపల్లి - 94401 03134

నా పాల పైసల్ నాకిప్పియ్యిర్రి సారూ...

పోలీస్ : సాయిలు అంటే నువ్వేనా?

సాయిలు : నేనే సారు .. ఏం కావాలె సారు?

పోలీస్ : నయీం డైరీల నీ పేరుంది.

సాయిలు : నా పేరా .. నాకేం తెల్వది సారు.



పోలీస్ : బొంకకు .. బొక్కలిర గ్గొట్టి పొయ్యిల వెడ్త.

సాయిలు : అయ్యో! అమ్మతోడు సారు .. నాకేం తెల్వది.

పోలీస్ : షాద్‌నగర్ సాయిలు అంటే నువ్వే కదా ..

సాయిలు : నేనే సారు. కానీ నా పేరెందుకు రాశిండో నాకు తెల్వదు.

పోలీస్ : షాద్‌నగర్ సాయిలు దగ్గర 40 L అని రాశిండు .. అంటే నీ దగ్గర 40 లక్షలు దాశిపెట్టిండు. ఏడున్నయో చెప్పు.

సాయిలు : నా దగ్గర అన్ని పైసలుంటే గీడెందుకుంట సారు?

పోలీస్ : నక్రాల్ చెయ్యక్ రా బిడ్డా .. మంచి ముచ్చట కొద్ది చెప్పు. 40 లక్షలెక్కడ?

సాయిలు : హా .. యాదికొచ్చింది సారు. నేను పాల బ్యారం చేస్తా .. ఓసారి దావత్కి 40 లీటర్ల పాలు తీస్కవోయిండు - ఉద్దెర ఖాతా వెట్టి. అడిగితే బెదిరిచ్చిండు. ఇంగ పోతే వోని అనుకున్నా ...

పోలీస్ : 40 L అంటే 40 లీటర్లా ..?!


సాయిలు : అవును సారు. నా పేరు గిట్ల మరిశిపోకుండ యాదివెట్టుకుండు. వాడెంత మంచోడో ... ఎక్కన్నున్న పైసలొత్తే నా పాల పైసల్ నాకిప్పియ్యిర్రి సారు ...

పోలీస్ : హా .. అట్లనే!

- ఫేస్‌బుక్, వాట్సప్‌ల నుండి



‘గోవిందా.. గోవిందా.. బాగుచెయ్ నను గోవిందా’ అని అందరితో వెంకటేశ్వరుడి భజన చేయించారాయన. ‘అందాల చిన్ని దేవత’ అంటూ అన్నాచెల్లెళ్ల అనుబంధాన్ని అక్షరాలతో అందంగా ఫ్రేమ్ కట్టి పెట్టారు. ‘అమ్మా.. భవాని..’ లాంటి శ్రావ్యమైన భక్తి గీతాలతో పాటు ‘పిడుగులు పడిపోనీ.. ప్రళయాలే రానీ..’ లాంటి ఆవేశపూరితమైన పాటల్నీ రాశారు. ‘మిల మిల మెరిసే మగువా..’ అంటూ అమ్మాయి అందాన్ని సరికొత్తగా వర్ణించారు. ఏ జోనర్ పాటలనైనా అవలీలగా రాసేస్తూ ‘నా స్టైలే వేరు’ అని నిరూపించుకున్నారు. ఇప్పటికే 450 పాటలు రాసిన చిర్రావూరి విజయ్‌కుమార్ అనుభవాలే ఈ వారం ‘నా పాట’.



నా పాట...22


గోవిందా.. గోవిందా..

మహేష్‌బాబు హీరోగా నటించిన ‘బాబీ’ సినిమాలో పాటలు రాసేవారి కోసం వెతుకుతున్నారని తెలిసి వెళ్లాను. ‘వర్షం’ సినిమా తీసిన శోభన్‌గారు ఆ సినిమాకు డైరెక్టర్. మెహర్ రమేష్ అసిస్టెంట్ డైరెక్టర్. నాతో పాటు మరో 11 మంది వచ్చారు. అందులో ఎవరి పాట నచ్చితే వారికే అవకాశం. ఇంట్లో స్వేచ్ఛ లేని హీరోయిన్‌కు సమాజంపై ఉన్న కోపాన్ని తెలిపే పాట రాయాలి.

‘లోకం పీకే నరకాలి... పెట్రోలేసి కాల్చాలి..
ఈ సృష్టికే ప్రతిసృష్టి చేయాలి’

అంటూ సాగే పాట రాసి ఇచ్చాను. సెలక్ట్ అయింది. మణిశర్మగారు మ్యూజిక్ డైరెక్టర్. ఆ పాటను పూర్తిచేసే సమయంలోనే కృష్ణవంశీగారు అప్పుడప్పుడు మణిశర్మగారి ఆఫీసుకు వస్తూ ఉండేవారు. అప్పుడు ఆయన్ని కలిసి ఒక్క పాట రాసే అవకాశం ఇవ్వమని అడిగాను. దానికి ఆయన “మాకు రాయాలని మీకెంత తపన ఉంటుందో.. కొత్త టాలెంట్‌ని ఎంకరేజ్ చేయాలని మాకూ అంతే ఆతృత ఉంటుంది. మీరేదయినా డిఫెరెంట్‌గా రాసి తీసుకొని రండి. భలే ఉంది అనిపిస్తే తప్పకుండా తీసుకుంటాను” అన్నారు. ఆ మాటతో మూడు రోజులు కూర్చుని మూడు రకాల పాటలు రాసుకొని తీసుకెళ్లా. ఆయనకు అవేవీ నచ్చలేదు. కొంత నిరుత్సాహపడ్డాను. అయితే ఆయన “నిరుత్సాహపడకండి. నేను ముందే చెప్పాను. నాకు ఏదో ఒక థీమ్ ఉండాలి. అలా ట్రై చేయండి” అని చెప్పారు. నేను సరేనన్నాను.

బాబీ మూవీకి కో-డైరెక్టర్‌గా పనిచేసిన ప్రభాకర్‌గారే, కృష్ణవంశీ గారి ‘ఖడ్గం’ సినిమాకు కూడా కో-డైరెక్టర్. అప్పటికే ‘గోవిందా.. గోవిందా..’ అనే పాటను చాలామంది చేత రాయించారు. కాని ఎందుకో కృష్ణవంశీ గారికి ఏదీ నచ్చడం లేదు. ఏం చేద్దాం? అని ఆలోచిస్తుండగా ప్రభాకర్‌గారు నా గురించి చెప్పారట. ‘చిర్రావూరి విజయ్‌కుమార్ లోతుగా బాగా రాస్తున్నాడు’ అని చెప్పారట. నన్ను పిలిపించారు. కృష్ణవంశీగారు గుర్తుపట్టి ‘మీరు అప్పుడు వచ్చారు కదండీ’ అని అడిగారు. అవునండీ అన్నాను.



సరే.. అని కూర్చోమన్నారు.

డబ్బు మీద అప్పటికే చాలా పాటలు వచ్చాయి. అయితే వాటిని టచ్ చేయకుండా ఫ్రెష్‌గా ఉండే పాట కావాలని చెప్పి అద్నాన్ సమీ ‘లిఫ్ట్ కరాదే..’ పాట వినిపించారు. “అందులో ఒక కాన్సెప్ట్ ఉంటుంది. సైకిల్ ఇవ్వు లేదంటే ఒక బైక్ ఇవ్వు దేవుడా.. అని! చిన్నది ఇవ్వలేకపోతే పెద్దదైనా ఇవ్వు అని రివర్స్‌లో వెళుతున్నాడు. అదెందుకో నాకు నచ్చింది. ఆ కాన్సెప్ట్‌తో రాయండి. అయితే పాట అంతా డబ్బు గురించే ఉండాలి. ఈ సినిమాలో హీరో అవకాశాల కోసం ప్రయత్నిస్తూ ఎన్నో కష్టాలు పడుతుంటాడు. ఆ సమయంలో దేవుడిని అది ఇవ్వు.. లేదంటే ఇది ఇవ్వూ అని కోరుకుంటూ పాడాలి. ఈ పాటను రాసే రచయితలో కూడా ఆ తపన ఉండి, అవకాశాల కోసం కష్టాలు పడుతున్న వ్యక్తి అయితే ఆ ఫీల్‌తో బాగా రాయగలుగుతారని వెతుకుతున్నాం. చాలామంది రాశారు కాని మాకు ఎక్కట్లేదు... మీరూ రాయండి... ఎన్ని రోజులు టైం కావాలో అడగండి. ట్యూన్ లేదు. పాట బాగుందనిపిస్తే.. తీసుకుంటాం” అన్నారు.



కృష్ణవంశీ

మూడు రోజుల తర్వాత ఒక వెర్షన్ రాసి పట్టుకెళ్లాను. ప్రకాష్‌రాజ్‌గారు, ఉత్తేజ్‌గారు, సత్యానంద్‌గారు, ప్రొడ్యూసర్ మురళీగారు, కృష్ణవంశీగారు ఉన్నారు ఆఫీసులో.

నుదుటిరాతను మార్చేవాడా..
ఉచిత సేవలు చేసేవాడా..
లంచం అడగని ఓ మంచివాడా..
లోకమంతా ఏలేవాడా..

అని మొదలవుతుంది పాట. ‘లిఫ్ట్ కరాదే..’ పాటలోని కాన్సెప్ట్‌తో

జూబ్లీహిల్స్‌లో బంగ్లా ఇవ్వు..
లేనిచో హైటెక్ సిటీ ఇవ్వు
హైజాక్ అవ్వని ఫ్లైటొకటివ్వు..
వెంట తిరిగే శాటిలైటివ్వు..



దేవీశ్రీ ప్రసాద్

అని రాశాను. ప్రతి మనిషిలోనూ ఈర్ష్య, అసూయ ఉంటాయి. మనకు లేనిది అవతలి వారికి ఉండడం చూసినప్పుడు నాకెందుకు లేదబ్బా! అనే ఫీలింగ్ కలుగుతుంది. ఆ ఫీలింగ్ తెలిసేలా..

పనికి రాని చవటలకిచ్చి.. పరమ బేవర్స్‌గాళ్ల కిచ్చి..
నాకు ఎందుకు ఇయ్యవు పిలిచి.. కోట్లకధిపతి చెయ్‌రా మెచ్చి...
అని రాశాను.

"60 శాతం లిరిక్స్ సూపర్. మరో తొమ్మిది వెర్షన్స్ రాయండి. పాట ఓకే చేసేద్దాం" అన్నారు. తొమ్మిది కాదు పది రాద్దాం అనుకున్నాను. కాని రెండో వెర్షన్‌కే కృష్ణవంశీగారికి బాగా నచ్చింది. అప్పుడు దేవిశ్రీప్రసాద్ గారిని పిలిపించారు. ఆయన పాట ట్యూన్ మార్చారు. నిజానికి మొదట 'గోవిందా.. గోవిందా' అని పెట్టలేదు. ఎందుకంటే అంతకంటే ముందు నేను మోహన్‌బాబు గారి 'తప్పు చేసి పప్పు కూడు' సినిమా కోసం 'గోవిందా గోపాల.. ఈ ఈడు ఊయ్యాలా...' పాట రాశాను. అదే పదాన్ని వెంటనే మళ్లీ వాడాలంటే మనసొప్పలేదు. అయితే కృష్ణవంశీగారు "ఇందులో వెంకటేశ్వర స్వామి ఉన్నాడండి.. పాట వినే ప్రేక్షకులు ఈ రచయిత ఇంతకు ముందు ఏ పాట రాశాడా అని చూడడండి.." అని చెప్పారు. దాంతో



"గోవిందా.. గోవిందా..
బాగు చెయ్ నను గోవిందా.. " అని పెట్టాను.

రేపు పాట ఫైనల్ మిక్సింగ్ జరుగుతుందనగా అప్పుడు కృష్ణవంశీగారు మళ్లీ పిలిపించారు. మణికొండలో షూటింగ్ జరుగుతోంది. ఆయన "గోవిందా.. గోవిందా.. నుదుటి రాతను మార్చేవాడా.. ఉచిత సేవలు చేసేవాడా.. లైను బాగుంది. కానీ ఇంకా ఏదో వస్తే బాగుంటుంది. ట్రైచేయండి" అన్నారు. అప్పుడు నేను "సార్ రాయబట్టి రెండు నెలలు అయిపోయింది. ఇన్ని రాశాను.. ఇంక్ అంతా అయిపోయింది సార్.. ఇంకేమొస్తుంది" అన్నాను. ఆయన "నిన్ను ఏడిపించాలని కాదు.. విజయ్.. నీకే పేరొస్తుంది.. ఎందుకంటే 'నిన్నే పెళ్లాడుతా' సినిమాలో 'ఏటో వెళ్లిపోయింది మనసు..' పాటను సిరివెన్నెల సీతారామశాస్త్రిగారు రాసినప్పుడు పల్లవి రెండు లైన్లు 90 వెర్షన్లలో రాశారు. చంద్రబోస్‌గారు 'సిందూరం'లో 'హాయ్ రే హాయ్.. జాంపండు రోయ్...' పాట రాయడానికి మొదటి రెండు లైన్లకు 75 వెర్షన్లు రాశారు. మరి వాటికి ఎంత పేరొచ్చిందో నీకు తెలుసు కదా.." అన్నారు. సరేనని ఇంకో రెండు వెర్షన్లు రాశాను. కాని అవీ ఆయనకు నచ్చలేదు. ముందువే బాగున్నాయని వాటినే ఉంచేశారు. సింగర్ శ్రీ గారు ఈ పాటను పాడారు.

గురువు గారి ప్రశంస

నా సాహిత్యగురువు చంద్రబోస్‌గారు. ఆయన అప్పుడప్పుడు మ్యూజిక్ షోలకు జడ్జీగా వెళుతుంటారు. అలా ఒక టీవీ ప్రోగ్రాంకు వెళ్లినప్పుడు అక్కడ ఎవరో "తెలుగు పాటల్లో నేను కూడా ఇలా రాయలేనేమో అని మీకు అనిపించిన పాట ఏదైనా ఉందా?" అని ఆయనని అడిగారట. దానికి ఆయన "నా ఫ్రెండ్ విజయ్‌కుమార్ 'ఖడ్గం'లో రాసిన 'గోవిందా.. గోవిందా..' పాట విన్నప్పుడు మాత్రం ఏంటి.. వీడు ప్రతి లైన్లో కావ్యంలా ఇంత పెట్టాడేంటి.. అనిపించింది. నిజంగా నేను కూడా ఇలా రాయాలేనేమో అనుకున్నాను" అని చెప్పారట. ఈ విషయం ఆ ప్రోగ్రామ్ చూసిన నా స్నేహితుడు ఫోన్ చేసి చెప్పాడు.


చంద్రబోస్‌తో..

లక్షల మంది వీక్షించే టీవీ షోలో నా గురించి అలా చెప్పడం చాలా సంతోషాన్నిచ్చింది.

ఆయన స్ఫూర్తితోనే నేను ఇండస్ట్రీకి వచ్చాను. ఆయన నుంచి అంతటి గొప్ప ప్రశంస రావడం మర్చిపోలేను. అందుకే నా సినీ ప్రస్థానంలో 'గోవిందా.. గోవిందా' పాట ప్రత్యేకంగా మిగిలిపోయింది.

విజయ్‌కుమార్ సెల్ నెంబర్ - 98483 90749

- రాముడు

మహాత్మా...

ఈ అనాథల పుట్టినరోజు కూడా నేడే





పిల్లలతో గాదె ఇన్నయ్య

నేడు గాంధీ జయంతి...

ఈ పిల్లలు కూడా ఇదే రోజున సామూహిక పుట్టినరోజు వేడుకలు జరుపుకుంటున్నారు. నిజానికి అక్టోబర్ 2కు, వీరికి సంబంధమే లేదు. అసలు తమ పుట్టినరోజు ఎప్పుడో కూడా వీళ్లకి తెలియదు. సమాజం ఈ పసికూనలపై ఎప్పుడో 'అనాథ' అని ముద్రవేసింది. అయితే అనాథలకూ హక్కులు కావాలని, వారి హక్కులకు రెక్కలు తొడిగే ప్రయత్నం చేస్తున్నారు సామాజిక ఉద్యమ కార్యకర్త, 'మా ఇల్లు' ప్రజాదరణ ఆశ్రమం వ్యవస్థాపకుడు గాదె ఇన్నయ్య. అందులో భాగంగా 'గాంధీ జయంతి' నాడే 80 మంది అనాథ బాలబాలికల పుట్టినరోజును జరిపి వారి సమస్యలను అందరి దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. ఆయన ఆశయం సంఘటితశక్తిగా మారే దిశగా ఇప్పటికే కొన్ని అడుగులు పడ్డాయి. వాటి వివరాలే ఇవి...

"ఈ ప్రపంచానికి మనం నిజమైన శాంతిని బోధించాలంటే, యుద్ధానికి వ్యతిరేకంగా నిజమైన యుద్ధం ప్రకటించాలంటే దాన్ని పిల్లలతోనే ప్రారంభించాలి" అని దేశప్రగతిలో పిల్లల ప్రాధాన్యం గురించి గాంధీజీ ఏనాడో చెప్పారు. దేశ భవిష్యత్తు వారిపైనే ఆధారపడి ఉంటుందని ఆయన భావం. కానీ 'గాంధీ వారసులం' అని గొప్పలు చెప్పుకునే రాజకీయనాయకులు, ప్రభుత్వాలు గుర్తించని విషయం ఏమిటంటే ఈ దేశంలో నాలుగుకోట్లకు పైగా అనాథ బాలలున్నారని. వారికి అమ్మానాన్నలే కాదు... బంధువులూ...బాంధవ్యాలేకాదు, ఆఖరికి పుట్టినరోజులు సైతం లేవని. అందువల్ల వాళ్లు ఎన్ని ఇబ్బందులు పడుతున్నారో తెలిస్తే ఆశ్చర్యపోతాం.

'మేమేం పాపం చేశాం? మిగతా పిల్లల్లాగా మేమెందుకు మా పుట్టినరోజు జరుపుకోకూడదు?' అనాథాశ్రమాల్లో అనేకమంది పిల్లలు వేసే ప్రశ్న ఇది. పుట్టుకతో ఎవరూ అనాథలు కాదు... కానీ ఏవేవో కారణాల చేత కొందరు అనాథలవుతారు. తల్లిదండ్రులు ఎవరో తెలియని ఆ పిల్లలకు పుట్టినరోజు ఎప్పుడో ఎవరికైనా ఎలా తెలుస్తుంది? ఇక వేడుకలకు అవకాశం ఎక్కడ?

అక్టోబర్ 2నే 80 మంది పిల్లల బర్త్‌డే కూడా...

మన దేశంలో అనాథలను చేరదీసే స్వచ్ఛంద సంస్థలు చాలానే ఉన్నాయి. అనాథాశ్రమాలు వీరిలో కొందరికి నీడ కల్పిస్తున్నప్పటికీ అది తాత్కాలిక ఉపశమనం మాత్రమే. సాధారణంగా అనాథలనగానే ఎవరైనా సానుభూతిని వ్యక్తం చేస్తారు. తమ పిల్లల పుట్టినరోజులకో, ప్రత్యేక సందర్భాల్లోనో అనాథాశ్రమాలకు వెళ్లి తోచిన సాయం చేస్తారు. ఆ తర్వాత మర్చిపోతారు. అయితే అనాథలకు కావాల్సింది సానుభూతి కాదు సహానుభూతి. అందుకే గాదె ఇన్నయ్య తన అనాథాశ్రమానికి అనాథాశ్రమం అనే పేరు పెట్టకుండా 'మా ఇల్లు' ప్రజాదరణ ఆశ్రమం అని పెట్టారు. "అనాథ బిడ్డలు మాకు కూడా ఒక ఇల్లు ఉందని ఒక ఐడెంటిటీతో నివసించేందుకు 'మా ఇల్లు'ను 2005లో ఏర్పాటుచేశాం. వరంగల్ జిల్లా జఫర్‌గఢ్‌లో 'మా ఇల్లు' ఆశ్రమం ఉంది. అందులో 300 మందికి పైగా పిల్లలుంటారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మరో 'మా ఇల్లు' ఉంది. అక్కడ పిల్లలు కొత్త స్కిల్స్ నేర్చుకుంటారు. అనాథలను చేరదీయడంతో పాటు వారి హక్కుల కోసం కూడా పోరాటం చేస్తున్నాం. మన దేశంలో ప్రతీ పౌరుడి హక్కులనూ, చివరికి పశుపక్ష్యాదుల హక్కులను కాపాడేందుకు కూడా చట్టాలున్నాయి కానీ విచిత్రంగా అనాథలకు మాత్రం ఎలాంటి హక్కుల్లేవు" అన్నారు ఇన్నయ్య.

గాంధీజీ పుట్టినరోజునాడే 'మా ఇల్లు' ఆశ్రమంలోని సుమారు 80 మంది పిల్లలకు సామూహిక పుట్టినరోజు వేడుకలను జరుపుతున్నారు ఆయన. ఈ వేడుకలకు రాజకీయ, సామాజిక

ప్రముఖులు హాజరవుతున్నారు. వారి ఆధ్వర్యంలోనే పిల్లలంతా పుట్టినరోజు వేడుకలు జరుపుకుంటారు. " గాంధీ జయంతి నాడే ఈ పిల్లల పుట్టినరోజు వేడుకలు జరపడానికి ముఖ్య కారణం అనాథల సమస్యల పట్ల సమాజం దృష్టిని ఆకర్షించాలనే. మహిళలు, వృద్ధులు, దివ్యాంగుల గురించి ఆలోచిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారితో పాటు అనాథల హక్కులపై కూడా దృష్టి సారించాలని మా ఉద్దేశం" అన్నారు ఇన్నయ్య.



'రైట్ టు ఎడ్యుకేషన్' వీరికేది?...

'రైట్ టు ఎడ్యుకేషన్' యాక్ట్ ప్రకారం పిల్లలంతా చదువుకోవాలి. కానీ అనాథలు స్కూళ్లలో జాయిన్ అవుతున్నప్పుడు బర్త్ సర్టిఫికెట్, తల్లిదండ్రుల పేర్లు, పుట్టిన తేదీ, కులం అన్నీ అడుగుతారు. ఫారంలో అవన్నీ నింపాలి. ఈ పిల్లలు చదువుకోవడానికి ఈ రూల్సు అన్నీ అడ్డం వస్తున్నాయి. ఏదో ఒక పుట్టినతేదీ, ఏదో ఒక కులం పేరు, అలాగే తల్లిదండ్రుల పేర్లు, ఇంటిపేరు ఏదో ఒకటి చెప్పి జాయిన్ చేయొచ్చు. టెన్త్ దాకా అంత సమస్య ఉండదు. కానీ ఆ తర్వాత స్కాలర్‌షిప్‌లకు, ఫీజు రీ ఎంబర్స్‌మెంట్‌కు ఆధార్‌కార్డు, అడ్రస్ ప్రూఫ్, ఇన్‌కమ్ సర్టిఫికెట్ వగైరాలన్నీ కావాలి. అవి ఎక్కడి నుంచి తెస్తారు? ఎమ్మార్వోను అడిగినా, ఎవర్ని అడిగినా రూల్స్ ప్రకారం 'మేము ఇన్‌కమ్ సర్టిఫికెట్ ఇవ్వలేం' అంటున్నారు. అది లేకుండా ఫీజు రీ ఎంబర్స్‌మెంట్ రాదు.

భారత ప్రభుత్వం పాస్‌పోర్టు చట్టం ప్రకారం ఎవరికైనా పాస్‌పోర్టు ఇవ్వాలంటే తప్పకుండా డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్ కావాలి. 26 జనవరి 1989 తర్వాత పుట్టినవాళ్లకు డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్ తప్పకుండా ఉండాలి. కాని అనాథల పుట్టినరోజులు ఎవరికి తెలుస్తాయి? అందుకే అనాథల చదువులు పదో తరగతితోనే ఆగిపోతున్నాయి. వారిలో టాలెంట్ ఉన్నవాళ్లు ఉన్నత చదువులు చదివేందుకు ఎన్నో ఆటంకాలను ఎదుర్కోవాల్సి వస్తోంది. " ఒక అనాథను వదిలేస్తే వారు క్రిమినల్‌గా తయారైతే దానికి ఎవరు బాధ్యులు? ఆ క్రిమినల్‌ను శిక్షించడానికి, జైల్లో పెట్టి సంరక్షించడానికి ప్రభుత్వం ఎంతైనా ఖర్చు చేస్తోంది కాని ఒక అనాథ కోసం లక్షరూపాయలు వెచ్చించి పై చదువులకు పంపలేకపోతోంది. అలా చేస్తే వారు డాక్టర్లు, ఇంజనీర్లు, ఆఫీసర్లుగా తయారై దేశ నిర్మాణంలో పాలుపంచుకుంటారనే ధ్యాస పాలకులకు ఉండట్లేదు" అని ఇన్నయ్య ఆవేదన వ్యక్తం చేశారు.

అనాథలకు ఆధార్, ఓటరు గుర్తింపు కార్డులు ...

భారతదేశంలో పుట్టిన ప్రతి ఒక్కరికీ ఆధార్ కార్డు, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటరు గుర్తింపు కార్డు పొందే హక్కు ఉంది. అయితే అనాథాశ్రమాల్లో ఉన్న పిల్లలకు మాత్రం ఇవేవీ ఇవ్వడం లేదు. ఈ విషయాలపై ఇన్నయ్య గత కొన్నేళ్లుగా పోరాటం చేస్తున్నారు. మంత్రులకు, సంబంధిత అధికారులకు అనేకసార్లు విజ్ఞప్తి చేశారు. " ఢిల్లీలో ఆధార్ ఆఫీసుకు వెళ్లి చెప్పాను. కంప్లయింట్ చేశాను కాబట్టి మా పిల్లల వరకు సమస్యను సాల్వ్ చేశారు. ప్రజాదరణ ఆశ్రమానికే అధికారులు వచ్చి ఆధార్ కార్డులిచ్చారు. అలాగే ఎంతోకాలం అధికారుల చుట్టూ తిరిగి పోరాడితే ఆరోగ్యశ్రీ, ఓటరు గుర్తింపు కార్డులు కూడా ఇచ్చారు. కానీ అది వారికి హక్కుగా మాత్రం రాలేదు. ఆధార్ చట్టం ప్రకారం ఇంట్లో ఉన్నా, గుడిసెలో ఉన్నా ఆ అడ్రస్‌లో ఉంటే చాలు ఇవ్వాలని ఉంది. అయినా వీళ్లను మాత్రం పట్టించుకున్న నాథుడు లేడు. అందుకే ఆధార్‌ను అనాథలందరూ తమ హక్కుగా పొందేలా చట్టం రూపొందించాలని కోరుతున్నాం" అన్నారు ఇన్నయ్య. వీటన్నిటితో పాటు తల్లిదండ్రులు లేని పిల్లలను అనాథలని అనొద్దని, మానసపుత్రులుగా పేర్కొనాలని, అనాథాశ్రమాలనే పేరునే మార్చాలని, జీవో పాస్ చేయించి 'అనాథ' అనే పదమే తీయించేయమని ప్రభుత్వాన్ని ఆయన కోరుతున్నారు.



డిమాండ్ల సాధనకై 'ఫోర్స్' ...

దేశవ్యాప్తంగా ఉన్న నాలుగు కోట్ల మంది అనాథలకు 'ఐడెంటిటీ' ఇవ్వడం కోసం కొన్ని చర్యలు చేపడితే బాగుంటుందని 'ఫోర్స్' (ఫోర్స్ ఫర్ ఆర్ఫన్స్ రైట్స్ అండ్ కమ్యూనిటీ ఎంపవర్‌మెంట్) సంస్థ అభిప్రాయపడుతోంది. ఈ సంస్థకు ఇన్నయ్య అధ్యక్షుడిగా, శ్రీశైల్‌రెడ్డి పంజుగుల ఉపాధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల ఈ సంస్థ సభ్యులు, కొందరు అనాథ బాలలు కలిసి ఢిల్లీకి వెళ్లి కేంద్రమంత్రులకు అనాథల హక్కులకు సంబంధించిన వినతిపత్రాలను కూడా ఇచ్చారు. అందులోని ముఖ్యాంశాలు...

- అనాథ బాలలకు సంబంధించి ఒక పాలసీని కేంద్ర ప్రభుత్వం తీసుకురావాలి.
- వెనుకబడిన తరగతులు, దివ్యాంగులకు ఉన్నట్లుగానే విద్య, ఉపాధి, ఉద్యోగావకాశాల్లో అనాథలకు కూడా 3 శాతం రిజర్వేషన్లు కల్పించాలి.
- జాతీయ అనాథ హక్కుల కమిషన్‌ను (రాష్ట్ర కమిషన్ కూడా) ఏర్పాటు చేయాలి.
- అనాథల సంక్షేమం కోసం వారికి ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించడానికి జాతీయ అనాథల ఆర్థికసంస్థను ఏర్పాటుచేయాలి.
- దివ్యాంగుల్లాగే ఉన్నత చదువుల కోసం, ఉద్యోగావకాశాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్తున్న అనాథలకు రైల్వే రాయితీ పాసులివ్వాలి.

అనాథ బాలలను ఏవో కొన్ని ఎన్జీవో సంస్థలు చేరదీస్తున్నాయి గానీ ప్రభుత్వాలు వారి సమస్యలపై ఎప్పుడూ సీరియస్‌గా దృష్టిసారించలేదనేది వాస్తవం. ఒకరకంగా అనాథల సంరక్షణ అనేది రానురాను ఎన్జీవో సంస్థలకు కూడా భారంగా మారుతోంది. ఎన్జీవో సంస్థలు వారికి ప్రాథమిక సదుపాయాలు మాత్రమే కల్పిస్తున్నాయి. వారి సంరక్షణ ఎన్జీవోల బాధ్యతే అనే స్థితికి వెళ్లాయి ప్రభుత్వాలు. ఈ క్రమంలో ముందుగా చెప్పుకున్నట్లు అనాథ బాలల పట్ల చూపాల్సింది సానుభూతి మాత్రమే కాదని, సహానుభూతి అని పౌరసమాజం కూడా గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వారి ఉన్నతచదువులకు, ఉద్యోగావకాశాలకు ఎదురవుతున్న అనేకానేక ఆటంకాలను తొలగించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపైనే ఉంది. ఆ దిశగా ఇప్పటికైనా ప్రభుత్వాలు ఆలోచిస్తే మన దేశంలో నాలుగుకోట్లకు పైగా ఉన్న అనాథ బాలల జీవితాల్లో వెలుగు నిండుతుంది. బాపూజీ మాటలకు బలం చేకూరుతుంది.

గాదె ఇన్నయ్య ఫోన్: 98662 16680

- సి.ఎస్

ఫుట్‌పాత్‌లపైన దోమతెరలతో పాటు నైలాన్ ఉయ్యాలలను విక్రయించడం ఎప్పుడో ఒకసారి మనందరం చూసే ఉంటాం. అలాగే .. సముద్ర తీరంలో కొబ్బరిచెట్ల మధ్య పంచరంగుల నైలాన్ ఉయ్యాలల్లో విలాసంగా ఊగే సుందరిని ... టీవీ యాడ్స్‌లోనూ, మాగజైన్ యాడ్స్‌లోకూ చూసే ఉంటారు. ఆ ఉయ్యాల తయారీదారు గురించి ఆ సుందరికే కాదు మీకూ తెలియకపోవచ్చు. తెలుసుకోవాలంటే మనం శ్రీకాకుళం జిల్లాలోని రణస్థలి సముద్ర తీరానికి వెళ్లాలి.

ఉయ్యాలో ఉయ్యాలో కొవ్వాడ ఉయ్యాలో..



సముద్రతీర ప్రాంతంలో మత్స్యకారులు ఏం చేస్తారు? చేపల వేటనే బతుకుదెరువుగా చేసుకుని జీవనం సాగిస్తారు. ఒకప్పుడు సముద్రంలో చేపల వేటతో బతికిన రణస్థలి మండలంలోని కొవ్వాడ గ్రామ ప్రజలకు ఇప్పుడు నైలాన్ ఉయ్యాలల తయారీయే జీవనాధారంగా మారింది. దేశం నలుమూలలా కనిపించే ఈ పంచరంగుల నైలాన్ ఉయ్యాలల తయారీ కేంద్రం ఇవ్వాళ కొవ్వాడ గ్రామమే . అలాగని అక్కడ ఉయ్యాలలు తయారుచేసే ఫ్యాక్టరీలు ఏమీ లేవు. నిపుణులూ లేరు. మత్స్యకారులే వలల బదులు వీటిని భారీ ఎత్తున తయారుచేస్తున్నారు. ఈ గ్రామంలో దాదాపు 1800 మత్స్యకారుల కుటుంబాలున్నాయి. అందులో 6 వందల కుటుంబాలు ఈ వృత్తిపైన ప్రత్యక్షంగా, మిగిలినవారు పరోక్షంగా ఆధారపడి బతుకుతున్నారు. ఊరు ఊరంతా ఇదే పని. ఒక్కొక్కరూ రోజుకు 15 నుండి 20 ఉయ్యాలలు తయారు చేస్తారు. చేపల వలలు అల్లడానికి నేర్చుకున్న విద్య ఇప్పుడిలా ఉయ్యాలల తయారీకి ఉపయోగపడుతోంది. ముడిసరుకును ఢిల్లీ, బెంగళూరు, చెన్నైల నుండి కొని తెస్తారు. ఈ ఉయ్యాలల్లో కూడా రకాలు ... చిన్న పిల్లలకూ, పెద్దలకూ విడివిడిగా చిన్నవీ, పెద్దవీ రంగురంగులవీ. వీటిని మడిచి జేబులో పెట్టుకుని తీసుకుపోయేంత అనుకూలంగా తయారు చేయడం విశేషం.

వల ఉయ్యాలగా మారిన వైనం

ఇదేంటి .. మత్స్యకారులు చేపలు పట్టకుండా ఉయ్యాలలు అల్లడం ఏమిటని ఆశ్చర్యపోతున్నారా? అవును. ఈ మార్పుకు ఒక నేపథ్యం ఉంది. కొవ్వాడ సమీపంలోని రణస్థలం, పైడి భీమవరాలలో రసాయన ఫ్యాక్టరీలు, ఫార్మా కంపెనీలున్నాయి. ఇవి విడుదల చేసే వ్యర్థ జలాలు సముద్రంలో కలుస్తూ మత్స్య సంపదను దాదాపు హరించేశాయి. దీనివలన తరతరాలుగా సాగించిన చేపల వేట ఆగిపోయింది. ఉపాధి పోయింది. చేసేదిలేక చేపల వేటకు వీడ్కోలు పలికి నైలాన్ ఉయ్యాలల అల్లిక పనితో పొట్టపోసుకుంటున్నారు అక్కడి మత్స్యకారులు.



కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు

దేశంలో ఉయ్యాలలు ఎక్కడ కనిపించినా అవి కొవ్వాడ మత్స్యకారులు అల్లిన ఉయ్యాలలే అయ్యుంటాయంటే అతిశయోక్తి కాదు. ఎందుకంటే వీటిని ఇక్కడ మాత్రమే తయారు చేస్తారు కాబట్టి. ఒక్కో ఉయ్యాల రూ. 200 నుంచి రూ. 600 వరకు సైజును బట్టి విక్రయిస్తారు. ఈ ఉయ్యాలలకు కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు పెద్ద మార్కెట్ ఉంది.

మత్స్యకారుల కుటుంబాలకు చెందిన యువకులు వీటిని దేశం నలుమూలలకు బృందాలుగా తీసుకెళ్లి విక్రయించుకుని నెలకోసారి మళ్లీ సొంతూరుకు వస్తుంటారు. ఇలా చెన్నై, బెంగళూరు, యూపీ, బీహార్, ఢిల్లీ, హైదరాబాద్, భువనేశ్వర్, కోల్‌కతా, హర్యానా, పంజాబ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ ... పలు రాష్ట్రాల్లో తిరిగి విక్రయిస్తారు.




వీటిని విక్రయించడం ద్వారా నెలకు రూ.25 వేల ఆదాయం సంపాదిస్తున్నట్లు కొవ్వాడకు చెందిన యువ మత్స్యకారుడు నాయుడు చెప్పాడు. అలాగే ఈ గ్రామంలోని ముసలీ, ముతకా ఉయ్యాలలు నేసి రోజుకు రూ.50 చొప్పున సంపాదించుకుని పొట్టపోసుకుంటున్నారు.

పెద్ద విషాదం ఏమంటే .. ఇప్పుడు కొవ్వాడలో లక్ష కోట్ల వ్యయంతో అణు విద్యుత్ ప్రాజెక్టు ఒకటి రాబోతోంది. దీని వల్ల రానున్న రోజుల్లో ఈ ఊరు మొత్తాన్ని ఖాళీ చేయించబోతున్నారు. అప్పుడు ఈ ఊరి జనం ఎక్కడికి వెళ్లి ఉయ్యాలలు నేసుకుంటారో చూడాలి!

- చుక్కా అప్పారావు,
ఆంధ్రజ్యోతి, శ్రీకాకుళం

నా ఇష్టం

Raju


మీ మతి మరుపు పాడుగానూ.. ఇది కూడా మరిచి పోతే ఎలాగండీ ?
సారీ అండీ షాపింగ్ చేస్తూ టైము తెలియలేదు. ఆకలికే ఆమాత్రం తట్టుకోలేక పోతే ఎలా ?
సారీ సార్ ఇది సెల్ఫ్ సర్వీస్ బార్ మీరే తాగాలి గాని మేము తాగించటం కుదరదు !!
షాపింగ్ చేసి ఇంటికొద్దామని క్యాబ్ కోసం ఎంత సేపు చూసినా రాలేదండీ !!
డోన్ట్ వర్రీ రాజుగారూ.. కాంతం షాపింగ్‌కి పోయింది టూ డేస్ వరకూ రాదు. చీర్స్ !



'అమీష్'
కాలచక్రంలో కాసేపు వెనక్కి...

అమెరికా అంటే ఆకాశహర్మ్యాలు, హైఫై జీవితం అనుకునేవారు అక్కడి 'అమీష్' విలేజ్‌లోకి అడుగుపెడితే ఆశ్చర్యపోతారు. ఇప్పటికీ ఆ గ్రామంలో 17వ శతాబ్దపు సంస్కృతి కనిపిస్తుంది. ఆ గ్రామంలో నేటికీ విద్యుత్ వాడరు. లాంతర్లనే వాడతారు. గుర్రపుబగ్గీలనే వాహనాలుగా ఉపయోగిస్తారు. టెక్నాలజీని గ్రామం సరిహద్దుల్లోకి కూడా రానివ్వరు. సాంప్రదాయ దుస్తులు ధరిస్తారు. వ్యవసాయాన్ని కూడా సాంప్రదాయ పద్ధతుల్లోనే చేస్తారు. ఇలాంటి ఎన్నో ప్రత్యేకతలకు చిరునామాగా ఉండే 'అమీష్' విలేజ్‌ను ఇటీవల ఎం.డి.మునీర్ సందర్శించారు. ఆ విశేషాలే ఇవి..

అమెరికాలోని విల్మింగ్టన్ నగరంలో ఉన్న మా అమ్మాయిని చూడ్డానికి ఇటీవల నేను, నా భార్య వెళ్లాం. అక్కడ నేను చూసిన ప్రదేశాల్లో నన్ను అమితంగా ఆకట్టుకున్నది 'అమీష్' విలేజ్. పెన్సిల్‌వేనియా రాష్ట్రంలో ఉన్న ఈ అమీష్ గ్రామం (దేశం) డెలవేర్ రాష్ట్రంలోని విల్మింగ్టన్ సిటీ నుంచి 70 మైళ్ళ దూరంలో ఉంది. అక్కడ అమీష్‌ల కల్చర్‌కు సంబంధించిన నమూనా గ్రామాన్ని ప్రజల సందర్శన కోసం ఏర్పాటు చేశారు. 13 నుంచి 14 డాలర్లు చెల్లించి దీనిని చూడాల్సి ఉంటుంది. మేము ముందు అక్కడికే వెళ్ళి ఆ తర్వాత జాన్ అనే బగ్గీ యజమాని అనుమతితో అసలు గ్రామానికి వెళ్లాం. ఆయన అమీష్‌లకు సంబంధించిన విశేషాలన్నీ తన గుర్రాల బగ్గీలో తీసుకెళ్ళి చూపించారు. అడుగడుగునా వింత గొలిపింది వారి జీవన విధానం.

గుర్రాలతో నడిచే వ్యాగన్లు, బగ్గీలు ...

పెన్సిల్‌వేనియా రాష్ట్రంలో ఉన్న ఈ గ్రామం 1720 సంవత్సరంలో ఏర్పడింది. అమెరికాలో మొత్తం 3 లక్షల మంది అమీష్ ప్రజలున్నారు. వీరంతా ప్రకృతి ఇచ్చిన వనరులపైన, ప్రధానంగా వ్యవసాయంపైన ఆధారపడి తమ జీవనం సాగిస్తున్నారు. గుర్రాలతో నడిచే వ్యాగన్స్‌లో, బగ్గిలలో ప్రయాణిస్తుంటారు. సోయాబీన్, మొక్కజొన్న, పొగాకు, బార్లీ, బంగాళదుంపలు, గోధుమ లాంటి పంటలను, కూరగాయలను పండిస్తుంటారు. మెటల్ వీల్స్ (రబ్బరు టైర్లు లేకుండా) అమర్చిన యంత్రాలను, పనిముట్లను స్వయంగా తయారు చేసుకుంటారు. వాటితోనే వ్యవసాయం చేస్తారు. వీరికి ఇతర ప్రపంచంతో ఎలాంటి సంబంధం లేదు. వీరంతా క్రిస్టియన్లే కాని 300 ఏళ్ల క్రితం యూరప్ నుండి వలస వచ్చిన ఒక ప్రత్యేక శాఖకు చెందినవారు.

అమీష్ విలేజ్ నిండా ఇలాంటి గుర్రపు బగ్గీలే...



ఆధునిక టెక్నాలజీకి దూరం...

అమీష్ ప్రజలకు బయటి ప్రపంచంతో ఏ మాత్రం సంబంధం లేదు. కరెంటు, ఫోను, ట్రాక్టరు, ఆటోమొబైల్ వేటినీ ఉపయోగించరు. ప్రపంచంలో జరుగుతున్న మార్పులతో వారికి సంబంధం లేదు. వందల ఏండ్ల క్రితం వారి తాతలు నడిచిన బాటలోనే వారు నేటికీ నడుస్తున్నారు. వారు ఇతరులతో మాట్లాడరు. ఇతరులతో ఫోటోలు సైతం దిగరు. వారి మొదటి ప్రాధాన్యం వారి కుటుంబాలు. రెండవ ప్రాధాన్యం జీసస్ క్రైస్ట్.

'అమీష్'... ఒక మూవ్‌మెంట్...

'అమీష్' అనేది ఒక పెద్ద మూవ్‌మెంట్. యూరప్‌కు చెందిన జాకబ్ అమ్మాన్ (1644 - 1720) దీని వ్యవస్థాపకుడు. మెన్నోనైట్స్ అనే తెగ నుంచి విడిపోయిన వారే అమీష్‌లు. మెన్నోనైట్స్ స్విట్జర్లాండ్‌లోని రైన్ నదీ తీరంలో ఉండేవారు. 17వ శతాబ్దం వరకు వీరంతా కలిసే ఉండేవారు. అమీష్‌గా విడిపోయిన తర్వాత 18వ శతాబ్దం ప్రారంభంలో పెన్సిల్వేనియాకు వచ్చి స్థిరపడ్డారు. అనంతరం న్యూయార్క్, ఇల్లినోయిస్, ఇండియానా, మిస్సోరీ, విస్కాన్సిన్, వర్జీనియా, కెంటకీ, టెన్నిస్, ఒహియో, మరికొన్ని రాష్ట్రాలలో సెటిల్ అయ్యారు. అమీష్ ప్రజలకు వారి నమ్మకాల పట్ల పూర్తి అంకిత భావం ఉంటుంది.


అమీష్‌ల పద్ధతులన్నీ ప్రత్యేకమే. ఆడపిల్లలు 16 సంవత్సరాల నుంచి 25 సంవత్సరాలలోపు, పురుషులు 25 సంవత్సరాల వయసులో కేవలం అమీష్ తెగకు సంబంధించిన వారినే వివాహమాడతారు. గుర్రాలు తప్ప ఇతర కట్న కానుకలు ఏమీ ఉండవు. గురువారం మాత్రమే వివాహాలు జరుగుతాయి. తండ్రి ఆస్తి పెద్ద కుమారుడికే దక్కుతుంది. మిగతా కుటుంబ సభ్యులకు ఆస్తి హక్కే ఉండదు. ఎవరైనా మరణిస్తే ఇంట్లో శవాన్ని రెండు రోజులు ఉంచుకుని మూడవ రోజు చర్చికి తీసుకెళ్ళి అక్కడ నుంచి స్మశానానికి తీసుకెళ్ళి పాతి పెట్టేస్తారు. ఎలాంటి అలంకరణలు, హంగామాలుండవు. సమాధుల నిర్మాణం ఉండదు. భూమిలో పాతిన చోట గుర్తుగా ఒక చిన్న పలక లాంటి రాయిని పెడతారు.

8వ తరగతి వరకే చదువులు...

అమీష్‌లకు వారే ఏర్పాటు చేసుకున్న ప్రత్యేక బడులున్నాయి. ఇందులో 8వ తరగతి వరకే చదువులు. అదే వారికి డిగ్రీతో సమానం. వ్యవసాయం చేయడం, దేవుణ్ణి ప్రార్థించడం తెలిస్తే చాలని వారి భావన. ఎక్కువ చదువులు చదవడం తమ జీవన విధానానికి చేటు అని భావిస్తారు. దేవుడి నుంచి వేరు చేసే ఏ పద్ధతీ తమకు అక్కర్లేదని వారు భావిస్తారు. కుటీర పరిశ్రమలను పెద్దఎత్తున అభివృద్ధి చేసుకున్నారు. వందల మందికి అందులో ఉపాధిని వారే కల్పిస్తారు. వారి ఉత్పత్తులకు మార్కెటింగ్ కూడా వారే చేసుకుంటారు. జెర్సీ ఆవుల పాల నుంచి రకరకాల ఆహార పదార్థాలను తయారుచేస్తారు.

అమీష్ యువతీ యువకుల వస్త్రధారణ





అమీష్‌లే నిర్మించుకున్న స్కూల్ బిల్డింగ్

కొన్ని రంగులే వాడతారు...

అమీష్‌లు ధరించే దుస్తులు ప్రపంచంలోనే ప్రత్యేకం. వాటిని వారే తయారు చేసుకుంటారు. లాంగ్‌స్లీవ్స్, ఫుల్‌స్కర్ట్, ఎలాంటి డిజైన్లు లేని నలుపు, నీలం, ముదురాకుపచ్చ దుస్తులను మాత్రమే ధరిస్తారు. ప్రతి డ్రెస్‌పై ఆప్రన్ తప్పనిసరి. వివాహితులు నల్లటి ఆప్రన్‌లు ధరిస్తే అవివాహితులు తెల్లటి ఆప్రన్స్ ధరిస్తారు. మహిళలందరూ ప్రార్థనా సమయంలో ప్రత్యేక క్యాప్‌ను ధరిస్తారు. హెయిర్ స్టైల్ అందరిదీ ఒకే విధంగా ఉంటుంది. పురుషులు కట్ సూట్లు, కోట్లు ఎలాంటి కాలర్ లేకుండా ధరిస్తారు. వేసవిలో కూడా బ్లాక్ డ్రెస్‌లే వేసుకుంటారు. యువకులు నిత్యం క్లీన్ షేవ్‌తో కనిపిస్తారు. అందరూ కూడా ప్రత్యేకమైన టోపీలను పెట్టుకుంటారు. 25 నుంచి 35 కుటుంబాలకు ఒక ప్రార్థనా మందిరం ఉంటుంది. ఇంటి అవసరం ఉన్నవారికి అమీష్ యువకులందరూ కలిసి ఇల్లు నిర్మించి ఇస్తారు. తమ కట్టుబాట్లకు భిన్నంగా అమీషేతరులతో కలిసి వారి అలవాట్లను అలవర్చుకున్న వారిని దాదాపు వెళ్ళగొట్టినంత పని చేస్తారు.



అమీష్ విలేజ్‌లో వ్యాసకర్త దంపతులు

నీటి కోసం గాలిమరలు...

అమీష్‌లు నీటి కోసం గాలిమరలను ఏర్పాటు చేసుకున్నారు. వాటి ద్వారా నీరును ట్యాంకుల్లోకి పెద్దఎత్తున తోడి పోసి నిల్వ చేసుకుంటారు. ఇండ్లకు ఆ నీటిని డీజిల్ ఇంజన్ల ద్వారా సరఫరా చేస్తారు. డెయిరీ ఫామ్స్ కోసం జనరేటర్స్‌ను వినియోగిస్తారు. అంతే తప్ప కరెంటు వాడరు. వాషింగ్‌మెషీన్లు, కుట్టుమిషన్లను కూడా గాలిమరల సహాయంతోనే నడుపుతారు. ఇండ్లలో గ్యాస్ ల్యాంప్‌లను మాత్రమే వాడుతుంటారు. బయటి ప్రపంచంతో ఏ మాత్రం సంబంధం లేని ప్రత్యేక లైఫ్‌స్టైల్‌తో జీవిస్తున్న అమీష్‌లను చూస్తుంటే చాలా ఆశ్చర్యమేసింది. లోకంలో ఇంకా ఇలాంటి వారున్నారా అనిపించింది.

రచయిత సెల్ : 99518 65223

కన్నడ సినీనటి హేమశ్రీ హఠాన్మరణం చాలా సంచలనం రేకెత్తించింది.

బెంగళూరు నుంచి ఆమె తన భర్త సురేంద్రబాబుతో కలిసి అనంతపురంలోని ఒక ఫామ్‌హౌస్‌కు వెళ్లింది. అక్కడ హఠాత్తుగా స్పృహ కోల్పోయింది. అపస్మారకస్థితిలో ఉన్న హేమశ్రీని హుటాహుటిన కర్ణాటక రాష్ట్రంలోని హెబ్బాల సమీపంలో ఉన్న ఒక చర్చి ఆసుపత్రికి తీసుకుని వెళ్లారు. అప్పటికే హేమశ్రీ మరణించిందని వైద్యులు నిర్ధారించడంతో హెబ్బాల పోలీసుస్టేషన్లో జరిగిన విషయాన్ని చెప్పారు సురేంద్రబాబు. ఆ సమయంలో ఆయనతో పాటు హేమశ్రీ తల్లి లీలావతి కూడా ఉంది.

రియల్ క్రైమ్ కహానీ - 21

మృత్యువుతో ప్రయాణం

మరుసటి రోజు పత్రికల్లో రకరకాల కథనాలు...

బెంగళూరులో ఉండాల్సిన హేమశ్రీ అనంతపురం జిల్లా రెడ్డిపల్లిలోని ఫామ్‌హౌస్‌కు ఎందుకు వెళ్లింది? అక్కడ భర్తతో గొడవపడిందా? అసలా ఫామ్‌హౌస్ ఎవరిది? భర్తతో కలిసి హైదరాబాద్ వెళ్తున్నానని స్నేహితులకు చెప్పిన హేమశ్రీ విగతజీవురాలుగా తిరిగి రావడానికి కారణాలేమిటి? ఇలాంటి అనేక ప్రశ్నలను లేవనెత్తుతూ పత్రికల్లో పతాక శీర్షికల్లో వార్తలు వచ్చాయి.

ఇంతలో హేమశ్రీ మాజీ ప్రియుడు మంజునాథ్ తెర మీదకు వచ్చాడు.

హేమశ్రీకి సురేంద్రబాబును పెళ్లి చేసుకోవడం ఇష్టం లేదని, ఆమె తల్లి బలవంతం మీద ఈ పెళ్లి జరిగిందని, తన కన్నా 20 ఏళ్ల పెద్దవాడిని తనకు కట్టబెట్టడాన్ని జీర్ణించుకోలేక హేమ తనతో పలుమార్లు ఆ విషయం చెప్పి బాధపడిందని చెప్పి సంబంధిత ఆడియో టేపులను మంజునాథ్ మీడియాకు విడుదల చేశాడు. దాంతో హేమశ్రీ మరణం మరింత మిస్టరీగా మారింది.

•••

అదే సమయంలో తెలుగు దినపత్రికల్లోనూ హేమశ్రీ మరణం వెనుక దారుణమైన నిజాలున్నాయని, పెద్దల హస్తముందని, ఆమెపై అత్యాచారయత్నం జరిగిందని కథనాలు వచ్చాయి. అనంతపురం జిల్లాకు చెందిన ఒక మంత్రి వద్దకు హేమశ్రీని పంపడానికి ఇద్దరు కార్పొరేటర్లు ప్రయత్నించారని, ఆమె ప్రతిఘటించడంతో మత్తుమందు ఇచ్చారని, ఆ క్రమంలో జరిగిన ఘర్షణలో హేమ మరణించిందని కూడా వార్తలు వచ్చాయి.

రకరకాల కథనాలు రావడంతో బెంగళూరు నగర కమిషనర్ జ్యోతిప్రకాష్ స్వయంగా కేసును సమీక్షించారు. హెబ్బాల పోలీసుల నుంచి వివరాలు తెలుసుకోవడంతో పాటు, రాయలసీమ పోలీసు ఐ.జి. గోవింద్‌సింగ్‌తోనూ మాట్లాడారు. పోస్టుమార్టం రిపోర్టులను పరిశీలించారు. హేమశ్రీ ఎక్కువ మత్తుమందు పీల్చడం వల్ల మరణించిందని పోస్టుమార్టం నివేదిక స్పష్టం చేయడంతో ఆమెతో పాటు చివరివరకు ఉన్న వారిని తీసుకొచ్చి విచారణ ప్రారంభించాలని హెబ్బాల పోలీసులను కమిషనర్ ఆదేశించారు.

•••

హేమశ్రీ భర్త సురేంద్రబాబు కర్ణాటకలోని ఓ సామాజిక వర్గానికి చెందిన సంఘానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి. ఆయనతో పెళ్లికి ముందు హేమశ్రీ బెంగళూరుకు చెందిన మంజునాథ్‌ను ప్రేమించింది. అతడినే పెళ్లి చేసుకోవాలనుకుంది. కానీ, హేమశ్రీ తల్లి లీలావతిపై ఒత్తిడి తెచ్చి సురేంద్రబాబు హేమశ్రీని తిరుపతిలో బలవంతంగా వివాహం చేసుకున్నాడు. ఈ విషయాన్ని హేమశ్రీ స్వయంగా ఓ కన్నడ చానల్ ఇంటర్వ్యూలో చెప్పింది. ఆమె మరణం తర్వాత మంజునాథ్ బెంగళూరులో బయటపెట్టిన కొన్ని ఆడియో టేపులు ఈ విషయాన్నే స్పష్టం చేస్తున్నాయి.

హత్యకు గురవటానికి మూడు రోజుల ముందు హేమశ్రీ మంజునాథ్‌తో సుదీర్ఘంగా ఫోన్‌లో మాట్లాడింది. తన భర్తకు మొత్తం ఐదుగురు భార్యలు, తొమ్మిది మంది పిల్లలని... తాను ఐదో భార్యనని హేమశ్రీ తనతో ఫోన్‌లో చెప్పినట్లు రికార్డు చేసిన ఆడియో టేపులను మంజునాథ్ బెంగళూరులో బయటపెట్టారు. పెళ్లయినా అతన్ని తాను భర్తగా అంగీకరించడం లేదని, ఎలాగైనా తనను లైంగికంగా లోబరుచుకోవాలని సురేంద్రబాబు ప్రయత్నిస్తున్నాడని, కుదరకపోతే అంతం చేయాలని చూస్తున్నాడని కూడా ఆమె చెప్పినట్లు ఆ టేపుల్లో ఉంది.

ఈ చిక్కుముడిని విప్పేందుకు ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ ముందుగా సురేంద్రబాబును ప్రశ్నించాలని నిర్ణయించుకుని ఆయనను పిలిపించారు. మరోవైపు సురేంద్రబాబు కారుడ్రైవర్ సతీష్ కోసం వెదకడం ప్రారంభించారు.

సురేంద్రబాబు వాంగ్మూలాన్ని హెబ్బాల పోలీసులు రికార్డు చేశారు. “వివాహం అయినప్పటి నుంచి కూడా హేమశ్రీ నాతో సరిగా ఉండేది కాదు. అయినా ఆమెను మంచి చేసుకోవాలనే నేను ఇన్నాళ్లు ప్రయత్నించాను. ఆమెకు దగ్గర కావాలనుకున్నాను. ఆ రోజు నేను, హేమ కారు వెనుక సీటులో కూర్చున్నాం. డ్రైవర్ సతీష్ కారు నడుపుతున్నాడు. బెంగళూరు నుంచి హైదరాబాద్ వెళ్లాలనుకుని బయల్దేరాం. రాత్రి ఆలస్యంగా బయల్దేరడంతో అనంతపురం చేరుకుని నా మిత్రుడు మురళి ఫామ్‌హౌస్‌లో విశ్రాంతి తీసుకుని మర్నాడు హైదరాబాద్ వెళ్లాలనుకున్నాం.

రకరకాల కథనాలు రావడంతో బెంగళూరు నగర కమిషనర్ జ్యోతిప్రకాష్ స్వయంగా కేసును సమీక్షించారు. హెబ్బాల పోలీసుల నుంచి వివరాలు తెలుసుకోవడంతో పాటు, రాయలసీమ పోలీసు ఐ.జి. గోవింద్‌సింగ్‌తోనూ మాట్లాడారు. పోస్టుమార్టం రిపోర్టులను పరిశీలించారు. హేమశ్రీ ఎక్కువ మత్తుమందు పీల్చడం వల్ల మరణించిందని పోస్టుమార్టం నివేదిక స్పష్టం చేయడంతో ఆమెతో పాటు చివరివరకు ఉన్న వారిని తీసుకొచ్చి విచారణ ప్రారంభించాలని హెబ్బాల పోలీసులను కమిషనర్ ఆదేశించారు.



ఈ క్రమంలో మురళికి ఫోన్ చేస్తే తాను బెంగళూరులో ఉన్నానని, తన వాచ్‌మ్యాన్ ఉంటాడని, అతనికి ఫోన్ చేసి చెబుతానని మమ్మల్ని వెళ్లమని చెప్పాడు. ఫామ్‌హౌస్‌కు వెళ్లిన కొద్దిసేపటికే హేమ వాంతులు చేసుకుంది. తనకు ఏదో అవుతోందని మెలికలు తిరిగిపోయింది. దాంతో నేను ఆ విషయాన్ని హేమ తల్లికి చెప్పి, హేమను కారులో హుటాహుటిన బెంగళూరు చర్చి ఆసుపత్రికి తీసుకెళ్లాను. కానీ అప్పటికే హేమ చనిపోయింది" అని భోరుమన్నాడు సురేంద్రబాబు.

స్టేట్‌మెంట్ అంతా విన్న ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ సూటిగా ఒక ప్రశ్న వేశారు.

"మీరు అనంతపురం జిల్లాలో రెడ్డిపల్లికి వెళ్లారు. అక్కడ హేమశ్రీ అనారోగ్యానికి గురైతే వెంటనే ఆమెను అనంతపురంలోని ఆసుపత్రులకు ఎందుకు తీసుకువెళ్లలేదు? బెంగళూరుకు ఎందుకు వెళ్లారు?"

"బెంగళూరులో మెరుగైన వైద్యం దొరుకుతుందనుకున్నాం"

" ఓకే... మీరిక వెళ్లొచ్చు. వీలైతే మళ్లీ ఒకసారి పిలుస్తాం"

"తప్పకుండా సార్... " అంటూ అక్కడి నుంచి వెళ్లిపోయాడు సురేంద్రబాబు.

సురేంద్ర కథనం నమ్మదగినదిగా లేదనిపించింది ఇన్‌స్పెక్టర్‌కు.

"సురేంద్రబాబు డ్రైవరు సతీష్ ఎక్కడున్నా పట్టుకురండి" అంటూ కానిస్టేబుళ్లను ఆదేశించాడు ఇన్‌స్పెక్టర్.

●●●

రోజులు గడుస్తున్నాయి... సతీష్ ఇంకా దొరకలేదు.

సురేంద్రబాబును అరెస్టు చేద్దామంటే ఎంపీగా పోటీచేసిన వ్యక్తి ఆయన.

సో... ఆధారాల కోసం రెడ్డిపల్లి ఫామ్‌హౌస్‌కు బయల్దేరారు ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్.

ఫామ్‌హౌస్ యజమాని మురళిని, అక్కడి వాచ్‌మ్యాన్‌ను ప్రశ్నించిన పోలీసులకు కొన్ని కొత్త విషయాలు తెలిశాయి.

"సార్, నాకు సురేంద్రబాబు ఫోన్ చేసి భార్యతో వస్తున్నానని చెప్పడంతో మా వాచ్‌మ్యాన్ ఉంటాడు అక్కడికి వెళ్లండని చెప్పా. వీరి కారు ఫామ్‌హౌస్‌కు చేరుకొనే సమయానికి మా వాచ్‌మ్యాన్ మల్లయ్య కూడా అక్కడికి వెళ్లాడు. అప్పటికే హేమశ్రీ కారు వెనుక సీటులో అపస్మారకస్థితిలో ఉంది. ఆమెకు ఒంట్లో బాగాలేదు... డాక్టర్ వచ్చేవరకు ఇక్కడే ఉంటామని వాచ్‌మ్యాన్‌తో సురేంద్రబాబు చెప్పారట. అయితే అప్పటికే ఆమె శరీరంలో ప్రాణం లేదన్న విషయాన్ని మల్లయ్య గమనించి నాకు ఫోన్ చేసి చెప్పాడు. దాంతో నేను వెంటనే సురేంద్రబాబుకు ఫోన్ చేసి ఫామ్‌హౌస్ నుంచి వెంటనే వెళ్లిపొమ్మని చెప్పాను. కాని బెంగళూరు నుంచి హేమ తల్లి లీలావతి వచ్చిన తర్వాతే వారంతా బెంగళూరు బయల్దేరి వెళ్లారు" అని మురళి చెప్పడంతో ఇన్‌స్పెక్టర్ అతడి వాంగ్మూలాన్ని కూడా రికార్డు చేశారు.

"సార్, నాకు సురేంద్రబాబు ఫోన్ చేసి భార్యతో వస్తున్నానని చెప్పడంతో మా వాచ్‌మ్యాన్ ఉంటాడు అక్కడికి వెళ్లండని చెప్పా. వీరి కారు ఫామ్‌హౌస్‌కు చేరుకొనే సమయానికి మా వాచ్‌మ్యాన్ మల్లయ్య కూడా అక్కడికి వెళ్లాడు. అప్పటికే హేమశ్రీ కారు వెనుక సీటులో అపస్మారకస్థితిలో ఉంది. ఆమెకు ఒంట్లో బాగాలేదు... డాక్టర్ వచ్చేవరకు ఇక్కడే ఉంటామని వాచ్‌మ్యాన్‌తో సురేంద్రబాబు చెప్పారట..."

కేసు ఒక కొలిక్కి రావాలంటే ఇక మిగిలింది కారు డ్రైవర్ సతీష్ ఒక్కడే...

హేమశ్రీ మరణం తర్వాత 18 రోజులకు సతీష్ పోలీసులకు పట్టుబడ్డాడు.

దాంతో హేమ కేసు విషయంలో క్లారిటీ రావడం... సురేంద్రబాబును అరెస్టు చేయడం చకచకా జరిగిపోయాయి.



ఆ మరుసటి రోజు వివరాలు వెల్లడించారు బెంగుళూరు పోలీస్ కమిషనర్ జ్యోతిప్రకాష్.

"సినీనటి హేమశ్రీది సహజమరణం కాదు. ఆమెను భర్తే దారుణంగా హత్య చేశాడు. హేమశ్రీని సురేంద్రబాబు బలవంతంగా పెళ్లి చేసుకున్నాడు. అయితే పెళ్లయి ఏడాదయినా హేమశ్రీ ఆయనకు శారీరకంగా దగ్గర కాలేదు. సురేంద్రబాబు ఎలాగైనా ఆమెను అనుభవించాలనుకుని ఆమెను తీసుకుని బయల్దేరాడు. ముందుగా బెంగళూరులోని ఒక షాపులో క్లోరోఫామ్ మత్తుమందు కొన్నాడు. అవకాశం దొరికిన చోట అమెకు మత్తుమందిచ్చి అనుభవిద్దామనుకున్నాడు. దారిలోనే వారిద్దరి మధ్య గొడవైంది. ఆమె ఏడుస్తూ పక్కకు తిరిగిన సమయంలో మత్తుమందును కర్చీఫ్‌లో వేసి హేమ ముక్కుకు అదిమిపెట్టాడు. ఆమె మత్తులోకి వెళ్లింది. అయితే కొద్దిసేపటికే ఆమె కదులుతుండటంతో మళ్లీ మత్తుమందుతో ముక్కు మూసాడు. మత్తుమందు ఎక్కువ మోతాదులో ఇవ్వడంతో ఆమె మరణించింది. దానికి ప్రత్యక్షసాక్షి డ్రైవర్ సతీష్. ఆ తర్వాత ఫామ్‌హౌస్‌కు వెళ్లి అక్కడ శవాన్ని మాయం చేద్దామనుకున్నాడు. కానీ ఫామ్‌హౌస్‌లో పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో విషయం హేమ తల్లికి చెప్పి మృతదేహాన్ని బెంగళూరు తీసుకుని వచ్చి కథ అల్లాడు. నేరం గురించి ఎన్ని అనుమానాలు ఉన్నప్పటికీ ఆధారాలు దొరికేవరకు పోలీసులు వేచిచూడాల్సిందే. ఈలోపే రోజుకో కథనంతో మా మీద మీడియాలో విమర్శలు వచ్చాయి. ఇప్పుడు పూర్తి ఆధారాలు దొరికాయి కాబట్టి సురేంద్రబాబును, ఆయన డ్రైవర్ సతీష్‌ను అరెస్టు చేశాం" అని సమావేశాన్ని ముగించారు కమిషనర్ జ్యోతిప్రకాష్.

- వేముల సత్యనారాయణ, 99854 88800

సులువుగా.. సౌకర్యంగా..

డూడుల్ డూడుల్ పిల్లోకేస్

(Doodle Doodle pillowcase)

ఐదేళ్లు దాటిన పిల్లలు ఉండే ఇంట్లో వస్తువులను ఉన్నవి ఉన్నట్టుగా జాగ్రత్తగా కాపాడుకోవడం చాలా కష్టం. పెన్సిల్ పట్టుకోవడం వస్తే చాలు.. గోడలపై, వస్తువులపై ఎక్కడబడితే అక్కడ రాయడం, బొమ్మలు గీయడం చేసేస్తుంటారు. అంతేనా ఇంట్లో పెద్దవాళ్లు లేకపోతే బెడ్‌రూమ్‌లో ఉండే పరుపు, దిండు, బెడ్‌షీట్ లాంటి వాటిపై కూడా తమ చిత్రకళను ప్రదర్శిస్తుంటారు. ఈ 'డూడుల్ డూడుల్ పిల్లోకేస్' అలాంటి అల్లరి పిల్లల కోసమే తయారుచేశారు. చూసేందుకు సాధారణ దిండు లాగే కనిపిస్తున్నా దీనిపైన స్కెచ్‌పెన్‌లతో రాసుకోవచ్చు, బొమ్మలు వేసుకోవచ్చు. తర్వాత తేలికగా తుడిచేయవచ్చు కూడా. పిల్లల గోలను భరించలేక దిండు కవర్లను మాటిమాటికి మార్చలేక విసిగిపోయిన వారికి ఈ పిల్లోకేస్ బాగా ఉపయోగపడుతుంది.





బేబీ బాత్ విజర్

(Baby Bath Visor)

చిన్న పిల్లలకు స్నానం చేయించేటప్పుడు చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. లేదంటే కళ్లలోకి సబ్బునీళ్లు పోయి ఏడ్చి గోల చేస్తారు. చెవుల్లోకి నీళ్లు పోయినా ప్రమాదమే. అలాంటి ప్రమాదాలను దూరం చేస్తుంది ఈ 'బేబీ బాత్ విజర్'. దీన్ని పిల్లల తలపై టోపీలా పెట్టి స్నానం చేయిస్తే కళ్లలోకి, చెవులలోకి నీళ్లు పోతాయన్న భయం ఉండదిక. చిన్నపాటి గొడుగులా నీటిని కళ్లపైకి రాకుండా కాపాడుతుంది ఈ బాత్ విజర్. అలాగే చెవులలోకి నీళ్లు పోకుండా హెడ్‌ఫోన్స్‌లా ఉండే భాగాలను కూడా ప్రత్యేకంగా ఇచ్చారు.



స్పాగెట్టి ఫోర్క్

(Spaghetti Fork)



నూడుల్స్ తినేందుకు ఫోర్క్స్ ఎక్కువగా వాడుతుంటాం. అయితే ఫోర్క్‌తో నూడుల్స్‌ను చుట్టి కింద పడకుండా తినాలంటే అంత తేలిక కాదు. ఎన్నిసార్లు తిప్పినా నూడుల్స్ తీగలు తీగలుగా జారిపోయి మీద పడుతుంటాయి. దాంతో చూసేవారు నవ్వుతారేమోననే భయంతో చాలామంది నూడుల్స్ అంటే ఇష్టమున్నా, పబ్లిక్‌లో తినడానికి ఇష్టపడరు. అలాంటి వారి కోసమే ఈ 'స్పాగెట్టి ఫోర్క్'. దీనికి ఉండే బటన్‌ను నొక్కగానే ఫోర్క్ గుండ్రంగా తిరిగి నూడుల్స్‌ను తనకు తానే చుట్టేసుకుంటుంది. మనం హాయిగా తినవచ్చు కింద పడేసుకోకుండా. చూసేందుకు స్టైలిష్ లుక్‌తో కూడా ఆకట్టుకుంటాయి ఈ ఫోర్క్స్.




ఇంటెక్

ఈ వస్తువులను వాటి పేరుతో నెట్‌లో సెర్చ్ చేసి, వివిధ ఆన్‌లైన్ సంస్థల ద్వారా కొనుగోలు చేయవచ్చు.

జిప్పర్ స్నీకర్స్

(Zipper Sneakers)

ఎన్ని రకాల చెప్పులున్నా బూట్లు వేసుకుంటే వచ్చే లుక్ వేరు. కొన్ని ఆఫీసుల్లో, స్కూళ్లలో బూట్లు వేసుకోవడం తప్పనిసరి కూడా. అయితే చాలామందికి బూట్లకి లేస్ కట్టుకోవడం సరిగా రాదు. అలాంటి వారు బయటికి వెళ్లినప్పుడు బూట్లు విప్పాల్సివస్తే మళ్లీ లేస్ కట్టుకోలేక తిప్పలు పడుతుంటారు. ఎలాబడితే అలా కట్టేస్తే చూడడానికి ఎబ్బెట్టుగా ఉంటుంది. అలాంటి తిప్పలు పడేవారి కష్టాలను తీరుస్తాయి ఈ 'జిప్పర్ స్నీకర్స్'. ఈ బూట్లకు లేస్ లుక్‌లోనే జిప్ ఇచ్చారు. కాబట్టి వీటిని తేలిగ్గా విప్పేయొచ్చు. మళ్లీ అంతే తేలికగా చిటికెలో వేసుకోవచ్చు. చూడ్డానికి చాలా ట్రెండీగా కూడా ఉంటాయి ఈ బూట్లు.



హోమియోకేర్ ఇంటర్‌నేషనల్‌లో
అర్టికేరియా సమస్యకు సరైన వైద్యం

డా. శ్రీకాంత్ మోర్లావర్
CMD
హోమియోకేర్ ఇంటర్‌నేషనల్



మానవ శరీర అవయవాలలో చర్మం అతి పెద్దది మరియు శరీర అంతర్గత అవయవాలకు రక్షణ కవచం వంటిది. వాతావరణ మార్పులు, అలర్జీలు మరియు కొన్ని ఆటో ఇమ్యూన్ వ్యాధుల మూలంగా ఎన్నో చర్మ సమస్యలు ఎదురవుతుంటాయి. ఇవన్నీ కూడా ఒకేలా ఉండటంతో, ఎలాంటి చర్మవ్యాధితో బాధపడుతున్నామన్న విషయం తెలియక చాలామంది సతమతమవుతుంటారు. అలాంటి వాటిలో అర్టికేరియా ఒకటి. ఈ వ్యాధి తలెత్తిన వారి చర్మంపై ఉన్నట్టుండి దద్దుర్లు ఏర్పడటం, విపరీతమైన దురద మొ॥ ఇతర లక్షణాలు కనిపిస్తాయి. ఇవి కొన్ని నిమిషాల నుండి కొన్ని గంటల వరకు కనబడి, తదుపరి పూర్తిగా అదృశ్యమవుతాయి. మరికొందరిలో ఇవి దీర్ఘకాలికంగా కొనసాగుతాయి. వీటిని గుర్తించి, తగిన చికిత్స అందించకుండా నిర్లక్ష్యం చేస్తే, ఒక్కోసారి ఇవి ప్రమాదకరంగా మారే అవకాశం ఉంటుంది కాబట్టి ఈ అర్టికేరియా వ్యాధి పట్ల అవగాహన పెంచుకోవడం ఎంతైనా అవసరం.



అర్టికేరియా అనేది ఒక సాధారణ చర్మ సమస్య. ప్రతి ఐదుగురిలో ఒకరు తమ జీవితకాలంలో ఏదో ఒక సమయంలో ఈ సమస్య బారిన పడుతుంటారు. అన్ని వయస్సుల వారిని ప్రభావితం చేసే ఈ సమస్య ప్రభావం స్త్రీ, పురుషులలో సమాన స్థాయిలో ఉంటుంది. అర్టికేరియాను 'హీవ్స్' అని కూడా అంటారు. దీని వలన చర్మంపై దురదతో కూడిన దద్దుర్లు ఏర్పడతాయి. కొందరిలో ఇవి **24** గంటల లోపున వాటంతట అవే తగ్గిపోతుంటాయి కానీ కొందరిలో మాత్రం ఇవి దీర్ఘకాలికంగా కొనసాగటం జరిగినప్పుడు ఇది ఒక తీవ్రమైన సమస్యగా పరిణమిస్తుంది.

అర్టికేరియా 2 రకాలు: **(1) అక్యూట్ అర్టికేరియా:** అర్టికేరియా లక్షణాలు 6 వారాల కంటే తక్కువ రోజులు ఉన్నట్లయితే దానిని అక్యూట్ అర్టికేరియా అంటారు. ఇది అర్టికేరియా సమస్యను ప్రేరేపించే అంశాలు ఎదురైనప్పుడు కలుగుతుంది.
(2) క్రానిక్ అర్టికేరియా: అర్టికేరియా సమస్య 6 వారాలకు మించి కొనసాగినట్లయితే దానిని క్రానిక్ అర్టికేరియా అంటారు.
ఈ సమస్యకు గల ఖచ్చితమైన కారణాల పరంగా ఇంతవరకూ స్పష్టత లభించలేదు. కానీ ఈ సమస్యకు సంకేతాలుగా శరీరంలో అంతర్లీనంగా ఉండే వివిధ ఆరోగ్య సమస్యలు - అంటే ముఖ్యంగా థైరాయిడ్, లూపస్ మొదలైన వాటి వలన అర్టికేరియా ఉత్పన్నమయ్యే అవకాశం కలదు.

కారణాలు: మన శరీరానికి సరిపడని పదార్థాలు లోనికి ప్రవేశించినప్పుడు వాటికి ప్రతిస్పందనగా చర్మంలో శోథమును కలిగించే ప్రక్రియ ద్వారా, కొన్ని కణాలు హిస్టమిన్ మరియు ఇతర కెమికల్స్‌ను రక్తప్రసరణలోకి విడుదల చేయడం వలన అర్టికేరియా సమస్య ఏర్పడుతుంది. ఇది కొన్ని ఆటోఇమ్యూన్ వ్యాధుల వలన కూడా కలగవచ్చు. **ప్రేరేపితాలు:** నొప్పి నివారణకు ఉపయోగించే మందులు • కీటకాలు మరియు పరాన్నజీవులు • ఇన్‌ఫెక్షన్‌లు కలిగించే బ్యాక్టీరియా మరియు వైరస్‌లు • అధిక ఒత్తిడి, మితిమీరిన సూర్యకాంతి, ఎక్కువ వ్యాయామం, గోకడం వంటి చర్యలు • మద్యపానం మరియు కొన్ని ఆహార పదార్థాలు • అధిక లేదా అల్ప ఉష్ణోగ్రతలకు గురి కావడం • జంతుకేశాలు, పుప్పొడి రేణువులు వంటి అంశాలన్నీ అర్టికేరియాను ప్రేరేపిస్తాయి.

లక్షణాలు: చర్మంపై ఎరుపు లేదా చర్మపు రంగులో ఏర్పడే దద్దుర్లు విపరీతమైన దురదను కలిగిస్తాయి. • ఈ దద్దుర్లు నొప్పి లేదా మంటను కలిగి ఉంటాయి (Angioedema) • ఇవి కళ్ళ చుట్టూ, బుగ్గలపై, పాదాలు, చేతులు, పెదాలపై ఏర్పడతాయి. ముఖ్యంగా ఈ వాపు గొంతులో ఏర్పడితే, ఆ వాపు వాయుద్వారాలకు అడ్డుగా నిలవటం వలన, అలాంటి పరిస్థితి ఒక్కోసారి ప్రాణాంతకంగా కూడా మారవచ్చు. • ఈ దద్దుర్ల పరిమాణం పెరగటం-తరగటం జరుగుతుంది మరియు వీటిని ప్రేరేపించే అంశాలకు గురి అయినప్పుడు ఆ తేడా కనిపిస్తుంది తదుపరి అదృశ్యమవుతూ ఉంటుంది. • ఈ దద్దుర్లపై ఒత్తిడిని కలిగించటం వలన ఇవి తెల్లగా మారడం వంటి లక్షణాలను గమనించవచ్చు.

వ్యాధి నిర్ధారణ పరీక్షలు: అక్యూట్ అర్టికేరియాను నిర్ధారించేందుకు సాధారణంగా ఎలాంటి వ్యాధి నిర్ధారణ పరీక్షల అవసరం ఉండదు. దీర్ఘకాలికమైన మరియు తరచూ పునరావృతమయ్యే అర్టికేరియాకు అవసరమయ్యే నిర్ధారణ పరీక్షలు - CBP, ESR, థైరాయిడ్ స్టిమ్యులేటింగ్ హార్మోన్ (TSH) మరియు యాంటీ న్యూక్లియర్ యాంటీబాడీస్ ANA • అర్టికేరియల్ వాస్క్యులైటిస్‌ను నిర్ధారించుకోవడానికి పంచ్ బయాప్సీ పరీక్షను కూడా చేయవలసి ఉంటుంది.

హోమియోకేర్ ఇంటర్‌నేషనల్ చికిత్స: కాన్స్టిట్యూషనల్ హోమియోపతిలో భాగంగా, సూక్ష్మీకరణ పద్ధతిలో తయారైన హోమియో మందులతో, రోగి శరీర రోగనిరోధక కణాలకు పునరుజ్జీవం కల్పించి, ఎలాంటి దుష్ఫలితాలు లేకుండా 'అర్టికేరియా' సమస్యను పూర్తిగా నయం చేస్తారు. కేవలం హోమియోకేర్ ఇంటర్‌నేషనల్‌లో మాత్రమే లభించే ఈ విశిష్ట వైద్యరీతిలో వ్యాధి రీత్యా రోగి శరీర నిర్మాణం, వ్యక్తిగత మరియు మానసిక లక్షణాల పరిశీలన తదుపరి మాత్రమే అందించబడే చికిత్సతో 'అర్టికేరియా'ను పూర్తిగా నయం చేయుటం జరుగుతుంది.

టోల్ ఫ్రీ 1800 108 1212

కన్సల్టేషన్ ఉచితం
955 000 1199

www.homeocare.in

Advt



నా బొమ్మ



ఎ. శ్రీలక్ష్మి,
యుకెజి,
శ్రీకృష్ణ ప్లే స్కూల్,
హెచ్.బి. కాలనీ,
విశాఖపట్టణం.




బేతాళ ప్రశ్న - 4

ఒక బస్సు రోజూ 6 కి.మీలు ప్రయాణిస్తుంటుంది. ఉదాహరణకు ఆ బస్సు డ్రైవరు మీరే అనుకోండి. ఈరోజున బస్సు ప్రయాణం మొదలవగానే మొదటి స్టాపులో 10 మంది ఎక్కారు. రెండో స్టాపులో అందులో ఇద్దరు దిగి మరో ఆరుగురు ఎక్కారు. మూడో స్టాపులో నలుగురు దిగి 8 మంది ఎక్కారు. నాలుగో స్టాపులో ఐదుగురు దిగి 9 మంది ఎక్కారు. ఐదో స్టాపులో ఒక్కరు మాత్రమే దిగి ఎవ్వరూ ఎక్కలేదు. చివరి స్టేజీలో అందరూ దిగిపోయారు. ఇంతకీ ఆ బస్సు డ్రైవరు వయసెంత?

(పంపినవారు: జైత్ర కత్తుల)

సమాధానం వచ్చేవారం!



మీ దగ్గర ఇలాంటి మెదడుకు మేతవేసే ప్రశ్నలు, భేతాళ ప్రశ్నలు ఉంటే సమాధానంతో పాటు మా ఈమెయిల్ kerintha.aj@gmail.com కు పంపించగలరు.

గతవారం సమాధానం: కార్తీక్ తెంపిన నిమ్మకాయలు ఎనిమిది. అందులో సగం 4 మొదటి వాచ్‌మన్‌కి ఇవ్వగా ఇంకా 4 ఉంటాయి. రెండో వాచ్‌మన్‌కు నాలుగులో సగం 2 ఇవ్వగా ఇంకా 2 మిగిలాయి. మూడో వాచ్‌మన్‌కు రెండిట్లో ఒకటి ఇవ్వగా కార్తీక్ దగ్గర ఒక్క నిమ్మకాయ మాత్రమే మిగిలింది.

ఓడ లాంటి గుడి...



ఈ ఫోటో చూస్తుంటే.. ఇంగ్లీష్ సినిమాల్లో నీళ్లలో వెళ్తున్న ఓడను చూస్తున్నట్టుంది కదా! కానీ ఇది ఒక గుడి. పేరు తనా లాట్. ఇండోనేషియాలోని బాలి సముద్ర తీరంలో ఉంది. అక్కడున్న ఒక పెద్ద కొండపై 16వ శతాబ్దంలో దీన్ని నిర్మించారు. ఎన్నో ఏళ్లు కష్టపడి చెక్కినట్లు అందంగా కనిపిస్తున్న ఈ కొండ.. నిజానికి వందల ఏళ్ల పాటు అలల తాకిడికి గురై ఇలా తయారైంది. అయితే కొండ చివరన ఉన్న గుడికి వెళ్లే దారి మాత్రం మనుషులు వేసిందే. ఈ కొండ, గుడి ఎంత అందంగా కనిపిస్తున్నప్పటికీ సముద్రం వెనక్కు తగ్గినప్పుడు మాత్రమే అక్కడకు భక్తులు వెళ్లగలరు. లేదంటే దూరం నుంచే ఆ అందాన్ని ఆస్వాదించాలి.

చుక్కలు కలపండి




కొబ్బరి పీత



కొబ్బరి చిప్పను నెట్టుకుంటూ పోతే.. కొబ్బరి పీత అయిపోతుందా.. అని అనుమానపడకండి. ఇది నిజంగానే కొబ్బరిపీత. ప్రపంచంలోకెల్లా అతిపెద్ద పీత. హిందూ పసిఫిక్ సముద్ర తీర ప్రాంతంలో ఎక్కువగా కనిపిస్తుంది. దీని ప్రధాన ఆహారం కొబ్బరి కాబట్టి దీనికి ఆ పేరు పెట్టారు. ఇది కొబ్బరి చెట్టు ఎక్కి, కాయను తెంపి, జాగ్రత్తగా కిందకు తెచ్చి, పీచు తీసి, టెంకను పగలగొట్టి మరీ కొబ్బరి తింటుంది. సాధారణంగా దీని శరీరం పొడవు ఒకటిన్నర అడుగుంటే, కాళ్లు మూడు నుంచి ఆరు అడుగులుంటాయి. ఆశ్చర్యమేమిటంటే ఇంత పొడవు కాళ్లున్నప్పటికీ ఇవి నీటిలో మాత్రం ఈదలేవు.

తలతో... ఎక్కేశాడు!



వెనక్కు నడవడం కాస్త వెరైటీ. కానీ, తలతో మెట్లెక్కడం మరీ వెరైటీ. చైనాకు చెందిన లీ లాంగ్ లాంగ్ ఆ పనే చేసి అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తాడు. అది కూడా అలాంటిలాంటి మెట్లు కాదు ఎత్తుగా పేర్చిన ఇనపమెట్లు. కేవలం రెండు నిమిషాల పది సెకన్లలో 36 మెట్లు ఎక్కేసి గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సృష్టించాడు. ఈ రికార్డ్‌తో గతంలో తన పేరుమీదే ఉన్న 34 మెట్లు ఎక్కిన రికార్డ్‌ను తిరగ రాశాడు లీ.

రంగులు వేయండి






మీకు తెలుసా!

- తల తిప్పకుండా వెనక్కు చూడగలిగే రెండే రెండు జంతువులు కుందేలు, చిలుక
- ప్రపంచంలో అత్యంత పొడవైన నాలుక ఉన్న వ్యక్తి చానెల్ టప్పర్ అనే అమెరికన్
- మనిషి కనుగుడ్లు పుట్టినప్పటినుంచి ఒకే సైజులో ఉంటాయి
- కాలి వేళ్ల గోర్ల కంటే చేతి వేళ్ల గోర్లు నాలుగు రెట్లు వేగంగా పెరుగుతాయి
- రొయ్య గుండె తలలో ఉంటుంది

దారి కనుక్కోండి





కనికట్టు కాదు కదా!

ప్రమాదమని తెలిసినా వేగంగా వెళ్తున్న సిటీ బస్సును అంతకన్నా వేగంగా వెళ్లి అందుకుని ఫుట్‌బోర్డు ట్రావెలింగ్ చేసే కుర్రాళ్లు ఈ ఫీట్ చూసి 'ఎవడీ సూపర్‌మ్యాన్' అనకుండా ఉండలేరు. కుర్రాళ్లే కాదు రోడ్డు మీద వెళ్తున్న ప్రతీ ఒక్కరూ ఆశ్చర్యపోవడం ఖాయం. ఇతని పేరు జో జీమింగ్. పేరున్న మెజీషియన్. ఇటీవల చైనాలోని లుయాంగ్‌లో 'ఇంటర్నేషనల్ మేజిక్ ఫెస్టివల్' వేడుకలు జరిగాయి. ఆ సందర్భంగా జీమింగ్ వేగంగా వెళ్లే బస్సుకు అరచేతిని మాత్రమే ఆనించి శరీరాన్ని గాల్లో తేలియాడేలా చేశాడు. హఠాత్తుగా ఒక వ్యక్తిని అలా చూసేసరికి రోడ్డు మీద వెళ్తున్న వారంతా నోరెళ్లబెట్టారు.





అవీ ఇవీ



నెయిల్‌పాలిష్ బొమ్మలు

కలర్ పెయింటింగ్స్, చార్‌కోల్ పెయింటింగ్స్, నెయిల్ ఆర్ట్... ఎవరి స్టయిల్ వారిది. అయితే పెయింటింగ్‌కు రెగ్యులర్ కలర్స్ వాడటం నచ్చలేదు సింగపూర్ చిత్రకారుడు చాన్ క్లెరేన్‌కు. అర అంగుళం కూడా లేని గోళ్లు నెయిల్‌పాలిష్ వేయగానే అందంగా మెరుస్తాయి కదా... అలాంటి నెయిల్‌పాలిష్‌నే ఉపయోగించి కాన్వాస్ మీద పెయింటింగ్స్ వేస్తే ఇంకెంత బాగుంటుందో కదా అనే ఆలోచన అతడికి వచ్చింది. అప్పటి నుంచి నెయిల్‌పాలిష్‌లే క్లెరేన్ చిత్రాలకు రంగులుగా మారాయి. ఇప్పటిదాకా ఆయన కొన్ని వందల నెయిల్‌పాలిష్ చిత్రాలు వేశాడు. " మామూలు రంగుల్లో షైనింగ్ ఉండదు. 'నెయిల్ పాలిష్‌లో షైనింగ్ ఎఫెక్ట్ బాగుంటుంది. నా బొమ్మలు చూడండి ఎంత బాగా మెరుస్తుంటాయో" అంటున్న క్లెరేన్ మాటలు నిజమేననిపిస్తోంది కదూ ఈ బొమ్మలను చూస్తుంటే.

భయపెట్టే వ్యాధులకు నమ్మకమైన వైద్యం

హెచ్ఐవి... ప్రాణాలు తీసే వ్యాధి. హెచ్ఐవి ఉందని తెలిస్తే ఇక మరణం తప్పదనే నిర్ణయానికి కూడా వస్తుంటారు. నిజానికి హెచ్ఐవి ఉందని తెలిసాక మందులు వాడకుండా ఉంటే మరణం తప్పదు. రోగనిరోధక శక్తి తగ్గిపోయి అవకాశ వ్యాధులు విజృంభిస్తాయి. అయితే హోమియో మందులు వాడటం వల్ల రోగనిరోధక శక్తి తగ్గకుండా చూసుకోవచ్చు. ఫలితంగా అవకాశ వ్యాధులు దరిచేరకుండా ఉంటాయి. హోమియో మందులు వాడితే ఎన్నేళ్లయినా హెచ్ఐవి వ్యాధి ఏమీ చేయలేకపోతుంది. చేయాల్సిందల్లా అనుభవజ్ఞుడైన హోమియో వైద్యుని పర్యవేక్షణలో క్రమం తప్పకుండా మందులు వాడటమే. హెచ్ఐవి అంటే మరణం తప్పదనే నిర్ణయానికి రాకుండా హోమియో వైద్యంపై నమ్మకం ఉంచితే అదే మీ జీవితాన్ని నిలబెడుతుంది.

హెర్పిస్ సింప్లెక్స్

సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటేనే శృంగారం తాలూకు సంతృప్తి లభిస్తుంది. సుఖవ్యాధులతో బాధపడుతుంటే ఇక సంతృప్తి ఎక్కడుంటుంది. హెర్పిస్‌తో బాధపడే వారిలో ఇదే పరిస్థితి ఉంటుంది. వీరిలో పురుషాంగంపైన చెమట పొక్కుల మాదిరిగా నీటి పొక్కులు కనిపిస్తాయి. నీటిపొక్కులు పగిలి ఎర్రగా పుండు పడుతుంది. ఇటువంటి సమయంలో తగు చికిత్స తీసుకోకపోతే ఇతరులకు సోకే ప్రమాదం ఉంది. లైంగిక కలయిక ద్వారా సంక్రమిస్తుంది.

హోమియో చికిత్స :

హోమియో మందులతో రోగనిరోధక శక్తి బలపడుతుంది. తద్వారా హెచ్ఐవి రోగుల్లో అవకాశవాద వ్యాధులన్నీ దూరమవుతాయి. వైరల్‌లోడ్ బాగా తగ్గిపోతుంది. హెర్పిస్ నివారణకు కూడా హోమియో చికిత్స అద్భుతంగా పనిచేస్తుంది.

సీజన్ మారితే తుమ్ములా?

సీజన్ మారినప్పుడల్లా కొందరిలో విపరీతంగా తుమ్ములు వస్తుంటాయి. ఇది మామూలే అని మిన్నకుంటారు. కానీ అదే సమస్య సైనసైటిస్‌గా మారే అవకాశం ఉంటుంది. దీర్ఘకాలంలో ఆస్తమాగా కూడా మారవచ్చు.

సైనసైటిస్ ప్రారంభంలో ముక్కులో నుంచి నీరు కారడం, ముక్కు దిబ్బడ, తలనొప్పి, తరువాత దశలో ముక్కులో దుర్వాసన, తీవ్రమైన తలనొప్పి వంటి లక్షణాలుంటాయి. ప్రారంభంలో తుమ్ములు క్రమంగా ఆస్తమాగా మారడం జరుగుతుంది.

కారణాలు : సైనస్‌లో ఉండే డిఫెన్స్ మెకానిజం చాలా వరకు సూక్ష్మక్రిములు శరీరంలోకి రాకుండా అడ్డుకుంటుంది. కానీ 5 మైక్రాన్ల కన్నా తక్కువ ఉండే పార్టికల్స్ సైనస్‌లో ఆగకుండా నేరుగా ఊపిరితిత్తుల్లోకి వెళ్లిపోతాయి. వీటిని బయటకు పంపించడానికి శరీరం ప్రయత్నిస్తుంది. ఫలితంగానే తుమ్ములు వస్తుంటాయి. అంతేకాకుండా ప్రిజర్వేటివ్స్ వాడిన ఆహారపదార్థాలు తినడం, వాతావరణ కాలుష్యం, ఇంట్లో పరిసరాలు శుభ్రంగా లేకపోవడం, దుమ్ము, ధూళి ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో ఉండటం వంటివి ఆస్తమాకు కారణమవుతాయి.

లక్షణాలు : ఆస్తమాలో కనిపించే ప్రధాన లక్షణాలు దగ్గు, ఆయాసం. పిల్లికూతలు కూడా ఉంటాయి. కొంత మందిలో దగ్గు మాత్రమే ఉంటుంది. దీంతోపాటు ఛాతీ పట్టేసినట్లుగా ఉంటుంది. పిల్లి కూతలు ఉన్నంత మాత్రాన ఆస్తమాగా నిర్ధారణకు రాకూడదు.

హోమియోతో దూరం :

సైనసైటిస్, ఆస్తమా సమస్యలు హోమియోతో శాశ్వతంగా పోతాయి. మళ్లీ తిరగబెట్టడం అంటూ జరగదు. ఎలాంటి సైడ్ఎఫెక్ట్‌లు ఉండవు.

Dr. K Ravikirane
M.D.,M.sc(psych), P.G(virology)LONDON
గోల్డ్‌మెడల్ ఫర్ ఎక్సలెన్సీ ఇన్ మెడిసిన్
మాస్టర్స్ హోమియోపతి
అమీర్‌పేట్, కూకట్‌పల్లి, దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్, విజయవాడ, కరీంనగర్, విశాఖపట్నం,తిరుపతి
ఫోన్ : 7842 106 106, 9032 106 106



తలనొప్పితో ఎన్నాళ్లు బతుకీడుస్తారు?

ఒకరోజు తలనొప్పి ఉంటేనే ఏ పనిచేసుకోలేకపోతాం. అలాంటిది రోజుల తరబడి తలనొప్పి వేధిస్తుంటే ఇక ఎలా బతుకీడుస్తారు? ఏ పనీ చేసుకోలేక, ఉద్యోగానికి సెలవులు పెట్టలేక నానా ఇబ్బందులు పడతారు. ఈ సమస్యలన్నీ మైగ్రేన్ తలనొప్పితో బాధపడే వారిలో కనిపిస్తుంటాయి. వీరిలో తలనొప్పితో పాటు వాంతులు, తలతిరగడం వంటి లక్షణాలుంటాయి. ఏ పని చేసుకోలేకపోతారు. నెలలో 10 రోజులు ఆఫీసుకు సెలవు పెట్టాల్సి వస్తుంది. ఏదైనా పనిచేస్తున్నప్పుడు తలనొప్పి మరింత తీవ్రమవుతుంది. తీవ్రమైన తలనొప్పి వల్ల ఏ పనీ చేసుకోలేకపోతాను. వికారం, వాంతులు, వెలుతురు చూడలేకపోవడం, శబ్దాలను వినలేకపోవడం వంటి లక్షణాలు ఉంటాయి.

కారణాలెన్నో...: సైనసైటిస్, తీవ్రమైన ఒత్తిడికి గురయ్యే వారిలో తలనొప్పి ఉంటుంది. కాబట్టి ముందుగా కారణాలను తెలుసుకునే ప్రయత్నం చేయాలి.. మెదడులో కొన్ని రకాల కెమికల్స్ విడుదల కావడం, రక్తనాళం ఎన్‌లార్జ్‌మెంట్ కావడం వంటివి తలనొప్పికి కారణమవుతుంది. అలర్జీ, లైట్, పెర్‌ఫ్యూమ్, స్ట్రెస్, స్మోకింగ్, ఆల్కహాల్, సమయానికి తినకపోవడం వంటి కారణాలు అందులో ఉంటాయి.

హోమియోతో మాయం : మైగ్రేన్ సమస్యకు ఇతర చికిత్సా విధానాల్లో పరిష్కారం లేదనే చెప్పవచ్చు. ఇతర చికిత్సల్లో లక్షణాలు తగ్గించేందుకు చికిత్స ఇస్తారే తప్ప మూలకారణాన్ని తొలగించేలా చికిత్స ఉండదు. నాలుగు రోజుల తరువాత మళ్లీ మామూలే అవుతుంది. కానీ హోమియో చికిత్స అలా కాదు. మూలకారణాన్ని తొలగిస్తుంది. మైగ్రేన్‌కు కారణమవుతున్న నరాలను సాధారణ స్థితికి తీసుకువస్తుంది. కెమికల్స్ విడుదలను అడ్డుకుంటుది. ఫలితంగా మైగ్రేన్ సమస్య శాశ్వతంగా తగ్గిపోతుంది. సమస్య మళ్లీ పునరావృతం కావడం అంటూ ఉండదు.

హెపటైటిస్ వైరస్‌తో సహజీవనమా?

హెపటైటిస్ అంటే కాలేయంలో కణాలు వాచిపోయి ఫైబ్రోసిస్, సిర్రోసిస్‌కు దారితీస్తుంది. దీంతో కాలేయ పనితీరు మెల్లగా తగ్గి ప్రాణాంతకంగా మారుతుంది. ఈ వ్యాధి వచ్చిన తర్వాత శాశ్వత పరిష్కారాన్ని చూపే చికిత్స ఇతర వైద్యవిధానాలలో లేదు. కానీ హోమియో వైద్యంలో అద్భుతమైన చికిత్స ఉంది.

ఇవీ కారణాలు : ఎక్కువ మందితో సెక్సువల్ కాంటాక్ట్ పెట్టుకోవడం, అపరిచితుల నుంచి సేకరించిన రక్తం అంటే హెపటైటిస్ వైరస్ ఉన్న రక్తాన్ని ఎక్కించడం, స్వలింగ సంపర్కం, ఒకరు వాడిన సిరంజీలు మరొకరు వాడటం వల్ల కూడా హెపటైటిస్ వచ్చే అవకాశం ఉంటుంది. తల్లి గర్భవతిగా ఉన్నపుడు ఈ వ్యాధి సోకినట్లయితే కడుపులోని బిడ్డకు కూడా సంక్రమించే అవకాశం ఉంటుంది.

లక్షణాలు :

ఆకలి లేకపోవడం, వాంతి వస్తున్నట్లుగా ఉండటం, ఒళ్లంత నొప్పులు, మూత్రం పచ్చగా రావడం జరుగుతుంది. తరువాత నెమ్మదిగా కామెర్లు మొదలవుతాయి. దీంతో పాటు చర్మంపై దద్దుర్లు కనిపిస్తాయి. హెపటైటిస్ బి వ్యాధి చాలా ఆలస్యంగా బయటపడుతుంది. కొన్ని సందర్భాలలో సంవత్సరాల తర్వాత బయటపడవచ్చు. దీన్ని క్రానిక్ ఇన్‌ఫ్లమేషన్ ఆఫ్ లివర్ లేదా క్రానిక్ హెపటైటిస్ అంటారు. వీరిలో కామెర్ల వ్యాధి తగ్గకుండా అలాగే ఉంటుంది.

హోమియో చికిత్స :

హెపటైటిస్ బి, సి వైరస్‌లు కాలేయంలో మల్టిపుల్ అయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుంది. దీన్ని రెప్లికేషన్ అంటారు. ఈ రెప్లికేషన్ అయ్యే పద్ధతిని హోమియోపతి మందుల ద్వారా అడ్డుకోవచ్చు. అంతేకాకుండా పెరిగిన వైరల్ లోడ్‌ను రోగనిరోధక వ్యవస్థ ద్వారా సమర్థంగా అడ్డుకోవచ్చు.

ADVT

రాతప్రతులు - 4




జంతు చర్మాలు

చర్మాలపై రాసే విధానం ఎక్కువగా విదేశాల్లోనే ఉంది. భారతీయ భాషల్లో రాసినవి ఉన్నా, రచయితలు విదేశీయులే. ఎక్కువగా జింక, మేక, గొర్రె మొదలైన జంతువుల చర్మాలను రాతకు ఉపయోగించేవాళ్ళు. మన దగ్గర పులి, జింక చర్మాలనే రాతకు ఎక్కువగా ఉపయోగించేవాళ్ళు. బౌద్ధభక్తుల పేర్లు, బుద్ధునికి సంబంధించిన ఎన్నో విషయాలు ఈ రాతప్రతుల్లో ఉన్నాయి.

1. సంస్కృతంలో సుబంధు అనే కవి రాసిన 'వాసవదత్త'ను యూరప్ దేశాలలో జంతుచర్మంపై కాపీ చేశారు.

2. జైసల్మేర్‌లోని జైన గ్రంథాలయంలో భుచలర్ అన్న శాస్త్రజ్ఞుడు 'బృహజ్ఞానకోశం' అన్న పేరుతో ఉన్న జంతుచర్మం రాతప్రతిని కనుగొన్నాడు.



3. స్టీన్ అన్న వ్యక్తి ఖరోష్టి లిపిలో రాసిన రెండు డజన్లకు పైగా జంతుచర్మం రాతప్రతులను 'నియా'లో కనుగొన్నారు. ఆ ప్రతుల్లో బౌద్ధభక్తుల పేర్లున్నాయి.

4. 579 పత్రాలతో అత్యంత కోమలంగా ఉండే జంతుచర్మంపై రాసిన రాత ప్రతి ఒకటి బ్రిటిష్ మ్యూజియంలో ఉంది.



ఏనుగు దంతాలు

బర్మాలోని 'కమ్మవాక' ప్రాంతంలో ఏనుగు దంతాలపైన రాసిన రాతప్రతులు లభ్యమయ్యాయి. శ్రీలంకలో కూడా బుద్ధుని సూక్తులను ఏనుగు దంతాలపైన విరివిగా రాసినట్లు తెలుస్తున్నది. ప్రాచీన చైనాలో కూడా దంతాలను రాతకు ఉపయోగించిన దాఖలాలు ఉన్నాయి.

వెదురు కర్రలు/ బొంగులు



వెదురు బొంగులపై 4వ శతాబ్దం నుండే రాయడం ప్రారంభించారు. ఒకానొక కాలంలో కొన్ని రకాల పుస్తకాలను నిషేధం విధించినపుడు వెదురుకర్రలపై రాసి వాటిని భూమిలోపల పూడ్చి కాపాడారు. ఈ ప్రతుల్లో ఎక్కువగా చైనా ఆచార వ్యవహారాలు, సామాజిక పరిస్థితులు, ఆలోచనా



విధానం, మేధావుల జీవిత చరిత్ర లాంటి విషయలుఉ ఉన్నాయి. Decimal Multiplication, table, Jin Teng, Sheng Shell మొదలగునవి కూడా ఇలా భద్రపరచబడ్డ వాటిల్లో ఉన్నాయి. 2013 ఆగస్టులో 40 మంది పరిశోధకులు TSINGHUA విశ్వవిద్యాలయంలో జరిగిన సమావేశంలో ఈ రాతప్రతులపై చర్చించారు.

- డా. పాలెపు సుబ్బారావు,
98499 56036

ఛాయా'చిత్రం'



"అడ్డురాకు ... నేనే గోల్ చేస్తా. వచ్చే ఒలంపిక్స్‌లో స్వర్ణపతకం నాదే చూసుకో .. "

మిక్స్చర్ పొట్లం

బొమ్మలు : **వెంకట్**

బోధపడిందా?

"ప్రజా ప్రతినిధి .. ప్రజా ప్రతినిధి అనే మాట తరచూ వినబడుతుంది ... అర్థం ఏమిటి గురూ?" అడిగాడు శిష్యుడు.

"ఏమీలేదు నాయనా .. ప్రజలకోసం వచ్చే ప్రతి నిధిని స్వాహా చేసేవాడిని ప్రజా ప్రతినిధి అంటారు" చెప్పాడు గురూజీ.

ముందే చెప్పలేకపోయావా?



"ఏమండీ .. ఇలాగే మీ జుట్టు రాలిపోతే మిమ్మల్ని వదిలేసి వెళ్లిపోతానంతే" కచ్చితంగా చెప్పింది కాంతం.

"ఈ విషయం ముందే తెలిసుంటే బాగుండేది కాంతం. జుట్టు రాలకుండా ఉండేందుకు ఇన్నాళ్లూ నానా జాగ్రత్తలు తీసుకున్నాను అనవసరంగా" నెత్తి గోక్కున్నాడు జోగినాథం.

ఇంతకంటే సింప్లిసిటీ ఉండదు

"సింప్లిసిటీకి నిర్వచనం చెప్పగలవా?"

"వంద రూపాయలు పెట్టి చెప్పులు కొన్న ఆడవాళ్లు 'షాపింగ్‌కు వెళ్లొచ్చామ'ని చాటింపు వేసుకుంటే, రెండు వేలు ఖర్చు చేసి మందు తాగిన మగవాళ్లు సైలెంట్‌గా వచ్చి పడు కుంటారు. ఇంతకంటే సింప్లిసిటీ ఏముందబ్బా!"

ప్రేమలేఖ

'ప్రియమైన నీకు ..

నీ గురించి ఏమి రాయాలో ఆలోచించి .. ఆలోచించి .. చించి .. తెలియక చివరకు నేనే జండూబామ్ రాసు కున్నాను...'

ఇట్లు - నీ కాళిదాసు

అమ్మ పనే!



"**అ**క్కా .. ఆకాశం చూడు ... ఎంత తళ తళ మెరుస్తోందో?" చెల్లెలు.

"అవును .. అమ్మ surf Excel తో ఉతికి ఆరేసిందనుకుంటానే .." అక్క.

పిచ్చర పిడుగు

"**అ**మ్మా .. ఇందాకట్నించి ఎండలో ఒక ముసలాయన అరుస్తున్నాడు. పదిరూపాయలివ్వమ్మా .."

"అయ్యో పాపం ... ఇదిగో ఇచ్చేసిరా నాయనా .. ఇంతకీ ఏమని అరుస్తున్నాడ్రా?"

"ఐస్ క్రీం .. ఐస్ క్రీం .. అని"

"ఆc ...!"



నేర్చుకున్న పాఠం

"**ఎ**క్కువగా పెళ్లయిన మగాళ్లకే పొట్ట వస్తుంది ఎందుకురా?" అడిగాడు వీరబాబు.

"బాధలన్నీ కడుపులోనే దాచుకుంటారు కాబట్టి" చెప్పాడు బుచ్చిబాబు.

నా అకౌంటు - నా ఇష్టం!

"**ఇం**దులో 3 దొంగ నోట్లున్నాయి .. చెల్లవు" చెప్పాడు బ్యాంకు క్యాషియర్.

"వీటిని నా అకౌంటులో కదా వేసేది. అవి మంచి నోట్లయితే నీకేంటి? దొంగనోట్లయితే నీకేంటి?" వాదించాడు కస్టమర్ కనకయ్య.

మందుబాబులకు ఇవ్వబడదు!



"**నా** మిత్రుడికి ఇల్లు అద్దెకు ఇవ్వనని అన్నావట ఎందుకు?"

"తాగుబోతులకు ఇల్లు అద్దెకు ఇవ్వను"

"వాడు తాగుబోతన్న విషయం ఎవరు చెప్పారు నీకు?"

"ఒకరు చెప్పక్కర్లేదు. ఇల్లు చూడ్డానికి వచ్చిన రోజే అటాచ్డ్ బారుందా అని అడిగాడు"

మెదడుకు మేత

"**ఒ**క పొలంలో 12 గొర్రెలున్నాయి. అందులో 6 గొర్రెలు పక్క పొలంలోకి వెళ్తే ఎన్ని గొర్రెలు మిగుల్తాయి?" అడిగాడు లెక్కల మాస్టారు.

"ఏమీ మిగలవు సార్" చెప్పాడు చింటు.

"అదెలా?" ఆశ్చర్యపోయాడు మాస్టారు.

"ఒక గొర్రె వెళ్లిందంటే అన్ని గొర్రెలూ దాని వెనకే వెళతాయండి" చెప్పాడు చింటు.

ఈ వారం కవిత

స్టైల్ ఆఫ్ లైఫ్

కొన్ని పూలు ఇన్ని రాళ్లు ఏరుకో ఏరుకో
సమయమో అవసరమో ఏవి వాడాలో నిర్దేశిస్తది
గోడలు కట్టుకుంటూ పో పో
ఎటోకటు దుంకడానికో
లేదూ బద్దలు కొట్టడానికో పనికొస్తయి
నాలుక మీద కత్తికి రెండంచుల సాన పెట్టు
ఒకవైపు తేనె అంటించు
వెటకారమో మమకారమో
ఏ అర్థమైనా వచ్చేటట్లు ఒడుపుగా విసురు
కళ్లద్దాల లోపలి చూపులకు
బయటి చూపులకు ఒక పాయింటైనా
తేడా ఉంచు
సన్నివేశానికి తగ్గట్టుగా అతికించుకోవచ్చు
వాక్యాల మధ్య ఖాళీలో, బ్రాకెట్లో పెట్టు
పొగడ్డానికో తెగడ్డానికో
ఫిలప్ చేసి వాడుకో
అట్లా వెళుతున్న వాడికొక నమస్కారం పడేయ్



బొమ్మ : **అక్బర్**

దాచిపెట్టుకుని, మరచిపోయిన నోట్‌లా ఎప్పుడైనా పనికి రావొచ్చు
వెన్నెల రేయిని, కాళరాత్రిని సమానంగా పొగుడుతూ ఉండు
ఆయా వేళలకి నీకేది ఇష్టమవునో తెలియదుగా మరి
రెండు జేబుల్లో రెండు కండువాల్ని దూర్చు
ఏ జెండా ఎగిరినా నీదై పోతది
ఇంట్లొక మాట బయటొక మాట
ఉండనీయ్
ఏ సందర్భంలోనైనా
నువ్వు లక్కులో చిక్కొచ్చు
నుదిటి మీద ఆల్వేజ్ వెల్‌కం రాయించుకో
ప్రతోడికి నీ చిరునామా
మెమొరి కార్డ్‌లో చేరిపోతుంది
దేనికీ మొహం వాచి, దేబిరించకు
సులువైన టెక్నిక్కులు మార్కెట్ లోకంలో బోలెడు
అన్నింటినీ బాగా గుర్తుంచుకో
ఒక్క మనిషిని తప్ప
ఎప్పటికెయ్యది ప్రస్తుతమో
అయ్యది దక్కించుకో కో
అమ్మ గర్భం మీది పసిబిడ్డ నాటి
గుర్తులు చెరిపేస్తూ .. చెరిపేస్తూ ..

- దాసరాజు రామారావు, 96182 24503

అనుగ్రహం

2-8 అక్టోబర్ 2016

డాక్టర్ పి.ఎ.రామన్




మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

సంప్రదింపులు, ఒప్పందాలకు అనుకూలం. ఆర్థికంగా ఫర్వాలేదనిపిస్తుంది. ఖర్చులు విపరీతం. అవసరాలు నెరవేరుతాయి. విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. కీలక పత్రాలు, రశీదులు జాగ్రత్త. ఆది, గురు వారాల్లో పనుల్లో స్వల్ప ఆటంకాలెదుర్కుంటారు. శుభకార్యం నిశ్చయమవుతుంది. ఆత్మీయులను కలుసుకుంటారు. వ్యాపారాలు ఊపందుకుంటాయి. కొనుగోలుదార్లను ఆకట్టుకుంటారు. భాగస్వామిక చర్చలు ఫలిస్తాయి. ఉద్యోగస్తులకు ధనయోగం. కీలక సమావేశాల్లో పాల్గొంటారు.




వృషభం : కృత్తిక 2,3,4; రోహిణి, మృగశిర 1,2 పాదాలు

ఆర్థికలావాదేవీలు సంతృప్తినిస్తాయి. రావలసిన ధనం అందుతుంది. ఖర్చులు అధికం. విలాసాలకు బాగా వ్యయం చేస్తారు. సన్నిహితులు మీ సలహా పాటించి లబ్ధి పొందుతారు. మంగళ, శని వారాల్లో ఒక సమాచారం నిరుత్సాహపరుస్తుంది. ఆరోగ్యం నిలకడగా ఉంటుంది. సంతానం కదలికలపై దృష్టి సారించండి. దంపతుల మధ్య సఖ్యత లోపం. మీ ఇష్టాయిష్టాలను లౌక్యంగా వ్యక్తం చేయండి. ఏ విషయాన్నీ తెగే వరకూ లాగవద్దు. వృత్తి, ఉద్యోగ బాధ్యతల్లో ఏకాగ్రత వహించండి.



మిథునం : మృగశిర 3,4; ఆర్ద్ర, పునర్వసు 1,2,3 పాదాలు

గృహంలో సందడి నెలకొంటుంది. ఆర్థిక అంచనాలు ఫలిస్తాయి. కష్టానికి ప్రతిఫలం అందుతుంది. ఖర్చులు పెరిగినా ధనానికి ఇబ్బంది ఉండదు. కుటుంబీకులతో ఉల్లాసంగా గడుపుతారు. గురు, శుక్ర వారాల్లో పరిచయస్తుల రాక ఇబ్బంది కలిగిస్తుంది. పనులు, కార్యక్రమాలు అనుకున్న విధంగా సాగవు. శుభవార్తలు వింటారు. సహోద్యోగులతో సమస్యలు తలెత్తవచ్చు. నిరుద్యోగులకు ముఖ్య సమాచారం అందుతుంది.




కర్కాటకం : పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష

అనుకున్నది సాధించే వరకు శ్రమిస్తారు. యత్నాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. ప్రముఖులతో సంప్రదింపులు జరుపుతారు. వ్యవహార ఒప్పందాల్లో మెలకువ వహించండి. శనివారం నాడు ఒక సంఘటన ఆందోళన కలిగిస్తుంది. ఖర్చులు అంచనాలకు భిన్నంగా ఉంటాయి. రావలసిన ధనాన్ని లౌక్యంగా వసూలు చేసుకోవాలి. పనులు అస్తవ్యస్తంగా సాగుతాయి. ఆహ్వానాలు, నోటీసులు అందుకుంటారు.




సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

ఈ వారం కొన్ని సమస్యల నుంచి బయటపడతారు. ఆలోచనలు కార్యరూపం దాల్చుతాయి. ఆదాయం సంతృప్తికరం. ఖర్చులు భారమనిపించవు. పరిచయాలు బలపడతాయి. పనులు సకాలంలో పూర్తి కాగలవు. చెల్లింపులు, నగదు స్వీకరణలో జాగ్రత్త. బాధ్యతలు అప్పగించవద్దు. సన్నిహితులకు ముఖ్య సమాచారం అందిస్తారు. వ్యవహారాల్లో ఏకాగ్రత వహించండి. దంపతుల మధ్య దాపరికం తగదు. మీ శ్రీమతి సలహా పాటించండి. వ్యాపారాల్లో గణనీయమైన పురోభివృద్ధి సాధిస్తారు.




కన్య : ఉత్తర 2,3,4; హస్త, చిత్త 1,2 పాదాలు

వ్యవహారాలు మీ చేతుల మీదుగా సాగుతాయి. కష్టానికి తగిన ప్రతిఫలం అందుతుంది. ఖర్చులు విపరీతం, ధనానికి ఇబ్బంది ఉండదు. సకాలంలో చెల్లింపులు జరుపుతారు. ఒక సమాచారం ఆలోచింపచేస్తుంది. శ్రమాధిక్యతతో పనులు పూర్తి చేస్తారు. బంధువులతో స్పర్థలు తలెత్తుతాయి. కొన్ని విషయాలు పట్టించుకోవద్దు. అవివాహితులకు శుభవార్తా శ్రవణం. ఉద్యోగయత్నంలో నిరుత్సాహం వీడండి. ఉద్యోగస్తులకు యూనియన్ వ్యవహారాలతో తీరిక ఉండదు.




తుల : చిత్త 3,4; స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు

ఆందోళన కలిగించిన సమస్య సద్దుమణుగుతుంది. యత్నాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. అవసరాలకు ధనం అందుతుంది. కొన్ని పనులు ఆకస్మికంగా పూర్తి చేస్తారు. సంతానం విషయంలో శుభపరిణామాలు సంభవం. ఆరోగ్యం కుదుటపడుతుంది. ఆది, సోమ వారాల్లో వ్యవహారాలు స్వయంగా చూసుకోవాలి. అవగాహన లేని విషయాల్లో జోక్యం తగదు. చెల్లింపులు, చెక్కుల జారీలో జాగ్రత్త. సన్నిహితులతో సంప్రదింపులు జరుపుతారు. ఉద్యోగస్తులకు ధనప్రాప్తి. దైవకార్యంలో పాల్గొంటారు.




వృశ్చికం : విశాఖ 4వ పాదం; అనూరాధ, జ్యేష్ఠ

వాగ్ధాటితో అందరినీ ఆకట్టుకుంటారు. పరిచయాలు బలపడతాయి. నిర్దిష్ట ప్రణాళికలతో యత్నాలు సాగిస్తారు. పనుల సానుకూలతకు మరింతగా శ్రమించాలి. మంగళ, బుధ వారాల్లో ఇతరుల బాధ్యతలు చేపట్టి ఇబ్బందులెదుర్కుంటారు. ఆదాయ వ్యయాలు అంచనాలకు భిన్నంగా ఉంటాయి. పొదుపు మూలక ధనం ముందుగానే గ్రహిస్తారు. అప్రియమైన వార్తలు వినవలసి వస్తుంది. వృత్తి వ్యాపారాల్లో రాణింపు, అనుభవం గడిస్తారు. ఉద్యోగస్తులకు ఏకాగ్రత ప్రధానం.




ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

రుణ విముక్తులవుతారు. ఆదాయం సంతృప్తికరం. కొత్త యత్నాలు ప్రారంభిస్తారు. బంధుత్వాలు బలపడతాయి. పనుల ప్రారంభంలో ఆటంకాలెదురవుతాయి. గురు, శుక్ర వారాల్లో మీ శ్రీమతి వైఖరి అసహనం కలిగిస్తుంది. మీ ఆగ్రహావేశాలను అదుపులో ఉంచుకోండి. సన్నిహితులకు ముఖ్య సమాచారం అందిస్తారు. పెట్టుబడులకు అనుకూలం. వ్యాపారాల్లో నష్టాలు భర్తీ చేసుకుంటారు. మీ పథకాలు సత్ఫలితాలిస్తాయి.



మకరం : ఉత్తరాషాఢ 2,3,4; శ్రవణం, ధనిష్ఠ 1,2 పాదాలు

అప్రయత్నంగా అవకాశాలు కలిసివస్తాయి. పదవులు స్వీకరిస్తారు. ఆందోళన తొలుగుతుంది. సన్నిహితులతో ఉల్లాసంగా గడుపుతారు. శనివారం నాడు ఖర్చులు అంచనాలను మించుతాయి. విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. పనులు అస్తవ్యస్తంగా సాగుతాయి. మీపై శకునాల ప్రభావం అధికం. మీ ప్రమేయంతో శుభకార్యం నిశ్చయమవుతుంది. అయినవారితో సత్సంబంధాలు నెలకొంటాయి.



కుంభం : ధనిష్ఠ 3,4; శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు

ఆర్థికంగా పురోగమిస్తారు. రుణ బాధలు తొలుగుతాయి. ఆదాయానికి తగ్గ ఖర్చులుంటాయి. కొంత మొత్తం పొదుపు చేయగల్గుతారు. గృహంలో ప్రశాంతత నెలకొంటుంది. పనులు వేగవంతమవుతాయి. గుట్టుగా యత్నాలు సాగించండి. ఆది, సోమ వారాల్లో ఎవరినీ అతిగా విశ్వసించవద్దు. సంప్రదింపులు ఫలిస్తాయి. వ్యవహారాల్లో సరైన నిర్ణయాలు తీసుకుంటారు. దంపతుల మధ్య అన్యోన్యత నెలకొంటుంది. ఆరోగ్యం పట్ల శ్రద్ధ అవసరం. ఉద్యోగస్తులకు ధనప్రాప్తి, పదవీయోగం.



మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

లక్ష్య సాధనకు మరింతగా శ్రమించాలి. అవకాశాలు అందినట్టే అంది చేజారిపోతుంటాయి. ఎవరి సహాయం అర్థించవద్దు. స్వయంకృషితోనే రాణిస్తారు. మంగళ, బుధ వారాల్లో ఊహించని ఖర్చులెదురవుతాయి. అవసరాలకు ధనం సర్దుబాటవుతుంది. పనులు మొండిగా పూర్తి చేస్తారు. ఆహ్వానం అందుతుంది. ఆత్మీయులను కలుసుకుంటారు. ఆరోగ్యం కుదుటపడుతుంది. వ్యవహార ఒప్పందాల్లో ఏకాగ్రత వహించండి. బంధువులతో అభిప్రాయభేదాలు తలెత్తుతాయి.

అవునా!



గత 45 ఏళ్లలో సముద్ర మట్టం 20 సెంటీమీటర్లు పెరిగింది.

- శనిగ్రహాన్ని నీటిలో వేస్తే పూర్తిగా కరిగిపోతుందని ఖగోళ శాస్త్రవేత్తల అంచనా.

- క్లీన్ షేవ్ చేసుకునే వారి కంటే గడ్డం పెంచేవారు ఎక్కువ రోజులు బతుకుతున్నట్టుగా ఒక పరిశోధనలో తేలింది.



తేనెటీగలు లేని ఒకే ఒక్క ఖండం అంటార్కిటికా.

- ఏటా తిమింగలాల బారిన పడి చనిపోతున్న వారి కంటే కొబ్బరికాయలు నెత్తిమీద పడి చనిపోతున్న వారి సంఖ్య ఎక్కువ.

- మగ ఏనుగులను బుల్ ఎలిఫెంట్స్ అనీ, ఆడ ఏనుగులను కౌ ఎలిఫెంట్స్ అని కూడా పిలుస్తారు.



ఎర్ర ఇంకుతో రాయడాన్ని పోర్చుగల్‌లో అమర్యాదగా భావిస్తారు

- వేటాడుతున్నప్పుడు నైలునదీ ప్రాంతంలోని మొసళ్లు రెండు గంటలపాటు ఊపిరి బిగబట్టగలవు.

- సాలెపురుగులను, తేళ్లను చూసి భయపడటాన్ని అరాచ్నోఫోబియా (arachnophobia) అంటారు

అదృష్ట రత్నజ్యోతి

రమేశ్చంద్ర మహర్షి

సెల్ : 92465 82255, ఫోన్ : 040-6522 5554

జి.పి.ఆర్., రాజమండ్రి

మా అమ్మాయి జన్మకుండలి నిర్మొహమాటంగా వివరించగలరు.

ఈ జన్మకుండలి ప్రకారం-

1. విద్య ఇంజినీరింగ్.

2. పుట్టినప్పటి నుండి 20 ఏళ్ళ వయసు వరకూ శుక్ర దశ. శుక్రుని అస్తంగత్వ దోషానికి పరిహారాలు పాటించాలి.

3. ప్రస్తుతం 20 నుండి 26 మధ్య రవి దశ. ఇది ఉద్యోగంలో అనిశ్చితికీ, అభద్రతకూ, వైవాహిక జీవితంలో సమస్యలకూ పనిచేస్తుంది.

మంచి విద్యకు పగడాలు ధరించాలి. మిగిలిన సమస్యలకు ఆయా పరిహారాలు పాటించాలి.

4. 20వ సంవత్సరంలో విద్య మెరుగవుతుంది. అయితే రాహుచంద్రుల వలన 21లో, 22లో విద్యలో ఆటంకాలు ఉంటాయి. వారిద్దరికీ పరిహారాలు పాటించాలి.

5. 22లో అనారోగ్యం, గురు భుక్తిలో. స్త్రీ సంబంధమైన అనారోగ్య సమస్యలతో బాధపడడం. దీనికి గురు, రవి, శక్రులకు పరిహారాలు పాటించి బయటపడాలి. ఇదే సమయంలో వివాహానికి సంబంధించిన ప్రయత్నాలూ, సంబంధాలు రావడం ఉంటుంది. కానీ ఎట్టి పరిస్థితిలోనూ వివాహం జోలికి పోకూడదు. వివాహం జరిగితే శుక్రుని అస్తంగత్వం వలన నిలవదు.



6. 23లో శన్యంతర్దశ. పోర్ట్‌ఫోలియో ఆయనదే. కానీ ద్వికళత్రాన్ని కలిగించేదీ, సేడిస్ట్‌ని భర్తగా ఇచ్చే పోర్ట్‌ఫోలియో కూడా ఆయనదే. పోనీ ఈ భుక్తి గడిచిపోయాక వివాహం చేయాలంటే దీని తర్వాత కళ్యాణ ఘడియలు లేవు. కనుక అధిపతికీ, కళత్ర కారకునికీ పరిహారాలు పాటించి వివాహాన్ని కాపాడుకోవలసి ఉంటుంది.

7. 24 వయసులో... అంటే బుధుని భుక్తిలో వృత్తిలో స్థిరమైన స్థితి. చదివిన చదువుకు పూర్తి న్యాయం చేసే ఉద్యోగం. ఇదే పీరియడ్‌లో ప్రభుత్వోద్యోగానికి ప్రయత్నించడం జరుగుతుంది. అయితే భవిష్యత్‌లో నడిచే చంద్ర దశ సహకారం లేకపోవడం వలన ఆ ప్రయత్నాలు ఫలించవు.

8. 25లో... అంటే కేతుభుక్తిలో ఒక పుణ్యక్షేత్ర సంబంధమైన నదీ స్నానం.

9. 26లో... శుక్రాంతర్దశలో వైవాహిక జీవితంలో ఒక గొప్ప యుద్ధం! విడాకులు. తోబుట్టువుకు గండం. ఉద్యోగంలో ఊహించని అవమానం.

కొంతమంది జీవితాలు ఒకానొక సంఘటనతో ఆద్యంతం మారిపోయే పరిస్థితి ఉంటుంది. అప్పటి వరకు ఒకటి. అప్పటినుండి పోలికా, పొంతనా లేని కొత్త జీవితం... ఇక్కడ జరిగేది దాదాపు అలాంటిదే. రవి దశ ప్రారంభం నుండే పరిహారాలు పాటిస్తే పరిస్థితి వేరుగా ఉంటుంది. అయితే పాటించాలి కదా... పాటించనివ్వాలి కదా... ప్రకృతి!!

బుద్ధిః కర్మానుసారిణీ!

10. 26 నుండి 36 వయసు మధ్య చంద్ర దశ.

చనిపోయే వరకూ మనల్ని మనం కాపాడుకుంటూ వెళ్ళడమే జీవితం!

అలా కాపాడుకోలేకపోవడమే దుఃఖం!

ఆ దుఃఖంలో మనిషి తీసుకునే నిర్ణయాలు తులనాత్మకంగా ఉంటాయా... అందునా దశానాథుడు చంద్రుడు... మనోకారకుడు. వ్యయాధిపతి. స్థితి భాగ్యంలో. పాపకర్తరి. అంటే విదేశ నివాసం!

చింతా జీవం దహత్యహో!!!

బ్రతికుండగానే కాల్చి చంపే మనోవేదనని జయించడానికి చేసే ప్రయత్నం... ఈ విదేశ నివాసం!

ఏదీ ఊరికే పోదు!

అజ్ఞాతవాసం లాంటి... తనకు తాను విధించుకున్న శిక్ష లాంటి ఈ పదేళ్ళ కాలం దాటగానే ప్రారంభమై, నడిచే ఏడేళ్ళ కుజ దశలో స్వదేశ నివాసం. గొప్ప గృహయోగం!

అదీనాః స్యామ శరదః శతమ్!

నిర్భయంగా, స్వతంత్రంగా గడిపే శేష జీవితం! - ఇంకా ఉంది.

ఈ వారం కథ

కిరణ్ చర్ల

తూ హోగా జరా పాగల్

"ఎంత ప్రేమించాలో, ఎలా ప్రేమించాలో, పెదవులెపుడు కలవాలో, చేతులెపుడు పెనవేసుకోవాలో... దానికో పద్ధతుంటుంది. ప్రేమ పెరక్కుండా, మోహం బరువు కాకుండా జాగ్రత్తపడాలి. రోజుక్కొంచెంగా ఇష్టాన్ని చంపేసుకోవాలి."

అనాది విశ్వంలో గ్రహగోళాలకావల జనించిన కాంక్షనై ఘనీభవించి, ఘనీభవించి, భ్రమిస్తూ, పరిభ్రమిస్తూ ఏమరుపాటుగా జారి భూమిని చేరి విస్ఫోటించి, అనుక్షణం జ్వలిస్తూ... చల్లార్చే రసహృదయి కోసం నిరీక్షిస్తున్నా. నన్ను నేనే దహించేసుకుంటున్నా.. జల్ తే హై జిస్ కేలియే... ఎదురుచూపులో కరిగిపోతోంది కాలం...

"తూ హోగా జరా పాగల్"... రింగవుతోంది...

హా మై పాగల్ హూ... పుట్టుకతోనే.

కొన్ని వసంతాలు... కొన్ని శిశిరాలు.. రెండిటి మధ్య పరుచుకున్న అనేకానేక మోహ శిఖరాలు... వియోగ అగాధాలు... సంతోష సంద్రాలు... దుఃఖ తీరాలు.

అరచేతిలోని మొబైల్ వెక్కిరిస్తోంది... ద నంబర్ యు ఆర్ ట్రయింగ్ టు రీచ్ ఈజ్... నచ్చని వాక్యం పదే పదే వినాలంటే చాలా కష్టం.

హైదరాబాద్‌లో సాయంత్రాలు ఎంత అందంగా ఉంటాయో... ట్రాఫిక్ అంత విరక్తి కలిగిస్తుంది. పంజాగుట్ట దాటితే చాలు... పద్మవ్యూహం ఛేదించినట్టే. లా మకాన్‌లో ప్లే ఒకటి ఉంది వెళ్దామా అనిపించింది క్షణకాలం. కాని ఇంటికొచ్చేశాను. నిశ్శబ్దం... లోపలా, బయటా.

రాత్రి తొమ్మిది దాటింది. బయట సన్నగా జల్లు మొదలయింది.

నాకై పలికే శతతంత్రుల వీణై... నా కోసమే విచ్చుకునే పూవై... వెచ్చని కావలింతై... జోరున కురిసే జడివానయ్యే నీలూ... అలసి సొలసి నా భుజంపై వాలి... ఒళ్ళు తెలీకుండా... రాత్రెప్పుడయిందో... ఎప్పుడు తెల్లారిందో ఎవడిక్కావాలి... నీలూ పరిమళం... నీలూమయం... ఇంట్లో ఎటు తిరుగుతున్నా... నీలూ... నీలూ...

డిన్నర్ అయిందనిపించి పనిలో పడ్డా. ఓ బడా కంపెనీ యాడ్ డెడ్‌లైన్ దగ్గరికొస్తోంది. రష్ చెక్ చేద్దామని... ల్యాపీ ఆన్ చేశా... టీవీలో చోటాసా సాయా థా... ఆంఖోంమె ఆయా థా... సురేష్ వాడ్కర్ మనసును కరిగించేస్తున్నాడు. నా మొబైల్ సైలెంట్‌గా చూస్తోంది. పనిలో పడితే అంతే. తనకేం గుర్తుండదు. తన గురించి కూడా తాను ఆలోచించదు. ఎవరన్నా ఎదురుచూస్తున్నా పట్టదు. క్షణమొక యుగమైన కాలంలో నేను...

•••

"నువ్వూ అందరిలానే ఆలోచిస్తున్నావ్. కొన్ని విషయాల్లో... నాతో ఉండాలంటే నువ్ మగవాడివి కాకూడదు..."

నీలూ నాకు పెట్టిన అతి ముఖ్యమైన షరతు.

అంటే..?

ఆపరేషన్ చేయించుకోనా మరి...

"తంతాను పట్టుకుని... పోగొట్టుకోవలసింది శారీరకం కాదోయ్... నన్ను సొంతం చేసుకోవాలనే నీ మగతనపు ఛాయనీ, నన్ను కబళించే లక్షణాల్నీ... అప్పుడే నువ్ నాతో ఉండగలవు" సవాలు చేస్తున్నట్టు చూసింది నా వైపు.

"అహో శశిరేఖా. ఏమి పరీక్ష పెడితివి... దానికంటే ఆపరేషన్ చేయించుకోవటమే తేలికేమో..." గడ్డం నిమురుకుంటూ అన్నా.

"అవునా... అయితే గుడ్‌లక్" ఫక్కున నవ్వింది.

పొరలు పొరలుగా విడిపోతూ... అస్పష్టతలోంచి స్పష్టతలోకి, స్పష్టతలోంచి అస్పష్టతలోకి... లోలోపలికి పయనిస్తూ... నన్ను నేను క్షణక్షణానికి దహించేసుకుంటూ... రెండో ముఖాన్ని చూసుకుని అసహ్యంతో నన్ను నేను ఛీదరించుకుని, క్షణంలో కాలి బూడిదవ్వాలని తపించి... నీలూ... నా నీలూ.. ఉండవోయ్ నాతో...

•••

"ఏంటి బాస్ మొహం వేలాడేశావ్... ఏం జరిగింది?" కాఫీ కప్పు అందిస్తూ దగ్గరకొచ్చి కూర్చుంది రమ... నా కొలీగ్. "ఒక మనిషిని అంతగా తలకెక్కించుకోకమ్మా... నలిగిపోతావ్... శూన్యాన్ని నింపే శక్తి ఎవరికీ ఉండదు" రమతో పదేళ్ళ స్నేహం... నా ప్రతి అడుగూ తెలిసిన వ్యక్తి.

"ఆఫీస్‌లో, బయటి ప్రపంచంతో కేర్‌లెస్‌గా, డామినేటింగ్‌గా ఉంటావ్. నీలిమ విషయంలో ఎందుకలా? పైగా నీతో మాట్లాడడం కోసం చూసే అమ్మాయిలు, నీ పరిచయం కోసం తహతహలాడే వాళ్ళూ నీ చుట్టూ ఇంతమందిని ఉంచుకుని..."

"తెలియని వారికి చెప్పొచ్చు. కానీ నీలాంటి మొండి ఘటానికి..."

"ఈ న్యూరాన్లు, న్యూరో ట్రాన్స్‌మిటర్లు ఇలా ఉన్నాయ్ మరి... ఏం చేద్దాం.. బ్రెయిన్ ట్రాన్స్‌ప్లాంట్ చేస్తారేమో కనుక్కో రమా..." నవ్వులో కలిపేసిన దిగులు.


సమాధానం తెలియనివి కొన్ని... తెలిసినా మార్చుకోలేనివి మరికొన్ని...

నీలూ.. నీలూ... ఏళ్ళ తరబడి ఒకటే పదం.

రెండు చెవుల మధ్య ఇంకేం లేదు.

"ద స్టేట్ ఆఫ్ బీయింగ్ అబ్సెస్డ్ విత్ సమ్‌వన్ ఆర్ సమ్‌థింగ్..."

ప్రతిక్షణం వెయ్యి ముక్కలవుతున్న



మెదడు.

ఇద్దరం కలిసి వీడ్ గట్టిగా రెండు దమ్ములేశాక ఆమె కళ్ళలో కనిపించిన అమాయత్వం.

"చిన్నా, తిరిగిపోతోందిరా... ప్రపంచం... నేనూ, నువ్వూ కలిసి భూమిని పట్టేసుకుందాం... రా"

నా చేయి పట్టుకుని లాగుతోంది నీలూ...

నా ప్రపంచం తన చుట్టూ తిరుగుతోంది... పట్టుకునే విఫలయత్నంలో నేను. పద్దెనిమిదేళ్ళకే జరిగిన పెళ్ళి... వంటింటికి పరిమితం చేయబోతే బతుకంటే తనను తాను విస్తరించుకోవటంలో ఉందని, అనంతంగా వ్యాపించడమే తన లక్ష్యమంటూ వచ్చేసింది. ఓ ఎన్జీవోలో ప్రోగ్రామ్ మేనేజర్‌గా నిలదొక్కుకుంటోంది. ఎన్నో సమస్యలు, మరెన్నో సంఘర్షణలు... కన్నీటి రాత్రులు... రేపటి స్వప్నాలు. నాలుగేళ్ళ క్రితం నా ప్రియమిత్రుడి అక్కగా నాకు పరిచయమై... నా జీవితంలోకి అనుకోకుండా ప్రవేశించింది. నా ప్రపంచాన్ని మార్చేసి... నన్ను అల్లుకుని... నాలో భాగమై... ఇద్దరం అందరికీ దూరమై... ఓ చిన్న ఇంట్లో ఉంటున్నాం. చిన్న పొదరిల్లు. పెళ్ళి, తాళి... వీటిపై నమ్మకాలు లేని వాళ్ళం... ఆలోచనలు ఎంత కలిసినా, ఎక్కడో ఇద్దరి మధ్య చిన్న ఫ్రిక్షన్. వాడెవడో మార్స్, వీనస్‌ల గురించి చెప్పాడు. మేం ఇద్దరం ఈ గ్రహానికి, ఈ సమాజానికి చెందిన వాళ్ళమే కానీ, ఇంకా వదలని పురావాసనలు. ఇద్దరి మధ్యా అన్నీ కలిసినా మరేదో దూరం.

•••

తన జీవితంలో వచ్చిన అన్ని ప్రశ్నలకు రౌద్రంగా సమాధానమిచ్చింది నా నీలూ. ప్రేమ కోసం ఎంతటి సాహసమైనా చేసే నీలూ, నాతో ఎక్కడికంటే అక్కడికొచ్చింది. కేఫ్‌లు, పార్కులు, కాఫీషాప్‌లు, ఫుట్‌పాత్‌పై నడుస్తూ కబుర్లు, సినిమాలు, దూరతీరాల ప్రయాణాలు. ఎలాంటి ఇన్హిబిషన్స్ లేవు. ఓ అమ్మాయి ఉంది నాతో, నేను కేర్‌ఫుల్‌గా ఉండాలి, కేరింగ్‌గా ఉండాలి, జాగ్రత్తగా కాపాడుకోవాలి. ఇలాంటి ఆలోచనలు, బరువులు ఏ మాత్రం ఫీలవ లేదు నేను. నాతో ఓ మనిషి ఉంది... ఓ అందమైన స్నేహం ఉంది... అంతే. రోజులు కలలా గడిచిపోతున్నాయి.

ఒకరోజు బంజారాహిల్స్‌లో సప్తపర్ణి ఎదురుగా... నా బైక్‌పై తను కూర్చుని ఉంది.

నేను ఫుట్‌రెస్ట్‌పై కాలు ఆన్చి నిలబడి ఉన్నా.

ఇద్దరం కబుర్లు చెప్పుకుంటున్నాం... టైమ్ రాత్రి ఎనిమిది కూడా దాటలేదు.

"ఎవరు మీరు? ఏంటి సంగతి? ఇక్కడేం చేస్తున్నారు" పెట్రోలింగ్ కానిస్టేబుళ్ళు.

తను బైక్ దిగింది. "ఏంటి మీ సమస్య. ఇద్దరు మనుషులు బయట తిరక్కూడదా? కలిసి మాట్లాడుకోకూడదా?" గదమాయించింది.

"కావాలంటే స్టేషన్‌కి పోదాం పదండి" అంది.

అది కాదు మేడమ్... అంటూ నసిగి వెళ్ళిపోయారు.

నాకు నవ్వొస్తూ ఉంటుంది నీలూ ఆవేశాన్ని చూస్తే. ప్రశ్నిస్తే ఏ మాత్రం భరించలేదు. తనే కరెక్ట్ అని నూటికి నూరుపాళ్ళు నమ్ముతుంది.

ఓసారి తను వాళ్ళ ఊరు వెళ్ళి వస్తోంది. నేను రిసీవ్ చేసుకోటానికి వెళ్ళాను. ట్రెయిన్ దిగే ముందే మళ్ళీ కాల్ చేసింది.

"చిన్నా, నేను కనబడగానే ఏం చేస్తావ్?"

"ఏం చేయాలి?"

"ఏమో నీ ఇష్టం..."

"నాకెలా తెలుస్తుంది?"

"సరే, నేనే చేస్తాలే"

ప్లాట్‌ఫాం 9... సికింద్రాబాద్ స్టేషన్.


అలా ఇంటర్‌సిటీ నుంచి దిగిందో లేదో... కెరటంలా వచ్చి చుట్టేసింది. పెదాలపై పెదాలు ఆన్చింది. పట్టపగలు... మత్తెక్కించే పరిమళం... పరిసరాలన్నీ మాయమయ్యాయి.

ఎప్పుడూ అదే ఉద్రేకం, అదే చలాకీతనం. నీలూ... నా నీలూ... గ్రహగోళాల రాపిడిలోంచి పుట్టిన శక్తి... తన బలమైన వ్యక్తిత్వాన్ని, భవిష్యత్తు పట్ల ఆశను, కావలసిన దానిపట్ల ఆమె నిబద్ధతను చూస్తే ఆశ్చర్యమేస్తుంది.

ఇద్దరం పరిచయమైన సంవత్సరం తర్వాత...

ఓ రోజు గండిపేట చెరువుగట్టున సూర్యాస్తమయాన్ని చూస్తూ... నీళ్ళలో కాళ్ళు జారవేసి కబుర్లు చెప్పుకుంటున్నాం... పసుపుపచ్చని నీలూ ముఖంలో కొత్త కాంతి...

నాలుగేళ్ళ క్రితం నా ప్రియమిత్రుడి అక్కగా నాకు పరిచయమై... నా జీవితంలోకి అనుకోకుండా ప్రవేశించింది. నా ప్రపంచాన్ని మార్చేసి... నన్ను అల్లుకుని... నాలో భాగమై... ఇద్దరం అందరికీ దూరమై... ఓ చిన్న ఇంట్లో ఉంటున్నాం. చిన్న పొదరిల్లు. పెళ్ళి, తాళి... వీటిపై నమ్మకాలు లేని వాళ్ళం... ఆలోచనలు ఎంత కలిసినా, ఎక్కడో ఇద్దరి మధ్య చిన్న ఫ్రిక్షన్.



"ఏం చేద్దాం... రేపేంటి మన లైఫ్... కలిసుందామా?" అడిగింది మళ్ళీ తనే.

"కొంచెం నమ్మకం కలుగుతోందోయ్ నిన్ను చూస్తే..." అంటూ భుజంపై తల ఆన్చింది.

ట్రిబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్లు, రియలెస్టేట్ పెట్టుబడులు, కొత్త కొత్త కార్లు, బ్యాంకు బేలన్సుల్లో మాత్రమే సంతోషాన్ని వెతుక్కునే వారి సంగతి చెప్పలేను కానీ... నా మటుకయితే జీవితంలో కొంత డబ్బు, కొన్ని వస్తువులు ఉంటే చాలు. అంతకంటే నచ్చిన మనిషితో బతికిన క్షణాలను నింపుకోవటం చాలా ముఖ్యమనిపిస్తుంది. అసలు ఆడ, మగ ఇద్దరూ ఉన్నదెందుకు... ఒకరి కోసం మరొకరు కాదూ! ఇద్దరూ కలిసి ఈ సృష్టిని వెలిగించానికి కాదూ! కానీ, ఈ కలిసుండడంలో ఎన్నో సమస్యలు. ఎన్నో ఒడిదుడుకులు... మరెన్నో సంఘర్షణలు, కలిసీ కలవని తనం... మోహం, స్నేహం మధ్య కనిపించని అనేక గీతలు! వాటిని నీలూ, నేను అధిగమించగలమా?

ఏమిటీ సంబంధం? ఈ సంతోషాన్ని తట్టుకోలేను... బాధనూ మోయలేను... నీలూ... నా నీలూ... నీలో భాగంగా కలిపేసుకో. ఇంత దగ్గరితనంలో దూరం మనసుకెలాగో అనిపిస్తోంది.

"ఏం కావాల్రా నీకు నా నుంచి గడ్డపోడా?"

ఓ ఆదివారం సాయంత్రం కెబిఆర్ పార్క్ ఔటర్ రింగ్‌లో చేయి చేయి పట్టుకుని నడుస్తున్నాం.

వాన కురిసిన సాయంసంధ్య వేళ... తలంటుకున్న చెట్లకు కొత్త మెరుపు...

నీలిమ కళ్ళలో పచ్చదనం ప్రతిఫలిస్తోంది.

"నువ్ కావాలి... నాకు మొత్తంగా..." అన్నా.

"ఇప్పుడున్నాగా చిన్నా... మొత్తం నీతోటే..."

అబద్ధం.. నీకు తెలుసు... నీలూ... లోపల నాకు వినిపిస్తోంది.

మార్పు సహజం... మార్పు అనివార్యం... మనుషుల్లో, ఇష్టాల్లో, మోహాల్లో, స్నేహాల్లో... కానీ, నీలూలో కూడానా? వచ్చిందా లేక, నేనే ఆమె నుంచి అతిగా ఆశిస్తున్నానా?

క్షణక్షణానికి అంతమై మళ్ళీ పుడుతుందో లేదో తెలీని సందేహంలో కలుస్తుంది ఆమె ఇష్టం, ప్రేమ నాపై. సందిగ్ధంలో ఉంచి నరకంలో ముంచుతుంది. మళ్ళీ ఒక్క కౌగలింతతో అన్నీ మరిపిస్తుంది.

క్షణానికి... అనంత కాలానికి మధ్య పరుచుకున్న నిరంతర ప్రవాహం నా దాహం. ఈ వెల్లువ తట్టుకునే శక్తి ఆమెకుందా? ఏమో... ప్రేమతో భారం పెంచి... తనను దూరం చేసుకుంటానేమో అని నా భయం. ఏ నిమిషం ఏ బంధం ఎలాంటి మలుపు తీసుకుంటుందో ఎవరికి తెలుసు? జీవితానికి అర్థం, సంతోషానికి నిర్వచనం వేగంగా మారుతున్న సందర్భం. ఎవరి వాదన వారికి సరిగ్గా అనిపించటం దూరాన్ని పెంచటం తప్ప మరోటి చేసే అవకాశం లేదు.

"నీ పని నువ్వు చూసుకో. చిన్నా, మనిద్దరం ఉండటం అంటే నేను నువ్వైపోవటం కాదు. నీతో నువ్వుండి... నాతోనూ ఉండు... నన్ను విసిగించకు... ప్లీజ్ డోంట్ సఫోకేట్ మీ యూ మానియాక్..." భళ్ళున పగిలిందో రాత్రి.

• • •

ఇంకో రోజు యాడ్ షూట్ నుంచి వచ్చి రిలాక్సవుతున్నా... నీలూ మొబైల్ రింగ్ అయింది. తను బుక్స్ సర్దుకుంటూ కాల్ కట్ చేసింది. మళ్ళీ రింగ్ అయింది... వేళాపాళా లేని కాల్స్ మాకు చాలా మామూలు విషయమే. అయినా ఈ రోజు ఏమిటో కొత్తగా ఉంది.

"ఎవర్రా ఇబ్బంది పడుతున్నావ్" అన్నాను క్యాజువల్‌గా. కానీ నాలో ఎప్పటి మనిషో మేల్కొంటున్నట్టు నాకే తెలుస్తోంది.

చురుక్కున చూసింది సమాధానం చెప్పకుండా.

నీలూ నా సొంతం... ఆస్తి కాదు... వస్తువు కాదు... ఇంట్లో కట్టేసుకోవడానికి. కానీ నా మనిషి. నా సొంతమైన మనిషి. నిజానికి తన పనులకు నేను ఏ రకంగానూ అడ్డు రాను. కానీ, తను కావాలి నాకు... తను నా ప్రపంచాన్ని నింపెయ్యాలి. తను వేరే దేనికీ చెందటం నాకు కష్టంగా ఉంటుంది.

మరో రోజు రాత్రి... ఒంటిగంట అయింది తను వచ్చేసరికి... ఏదో పార్టీ హెవీగానే జరిగినట్టుంది. ఉండబట్టలేక అడిగేశా..

మన మధ్య ఏమైనా ఉందా? క్లియర్‌గా చెప్పు...

కుదరకపోతే...

నాకు లోపల ఎక్కడో... తను పోవోయ్ అంటుందనే ఉన్నా... వదులుకోదనే ధైర్యం కూడా...

"పొద్దున్నే మాట్లాడదాం... పడుకో" విసుగు.

నాకు మండిపోతోంది. పోయి హాల్లో సోఫాలో పడుకున్నా...

కోపంగా తెల్లారింది. తన గదికి వెళ్ళాను. ప్రశాంతంగా నిద్రపోతోంది. గది నిండా తన పరిమళం. ఒక్కసారిగా మైకం కమ్మినట్టయింది. జుట్టు చెంపల మీదుగా జారుతోంది. పసుపు రంగులో మెరుస్తున్న కాళ్ళు... కోపం కిందకు జారింది... కోరికగా ముదిరింది. పక్కనే పడుకుని అదుముకున్నాను... మత్తెక్కించే పరిమళం...

ఉలిక్కిపడింది.

"చిన్నా..." నిద్రమత్తులోనే నవ్వింది.

నా మెడ చుట్టూ చేతులు వేసి మరింత అతుక్కుపోయింది. తను నన్ను నెట్టేయాలి. నేను గొడవ చేయాలి. కానీ, తను ఎప్పటిలా ప్రేమగా హత్తుకుంటోంది.. నా కోపం నడినెత్తికెక్కింది... పక్కకు నెట్టి వచ్చేశాను... నా క్రూరత్వం నాకే తెలిసిపోతోంది...

నా నీలూ దిగాలుగా చూస్తోంది.

సోఫాలో కాళ్ళు పైన పెట్టుకుని కూర్చుంది.

విషయం ఏదైనా... తప్పెవరిదైనా... ఆమె కళ్ళలో నీళ్ళు.

చూడలేను... తనను పొదివి పట్టుకున్నాను.

"ఏం చెయ్యను నీలూ... నిన్ను వదులుకోలేక... దూరాన్ని భరించలేక... నీతో ఉండలేక..."



"పో బే..." చెయ్యి తీసేసింది...

"మనుషుల్ని సొంతం చేసుకుంటే కానీ మన అనిపించుకునే ఓ గ్యారంటీ పత్రం తీసుకుంటే కానీ, శాంతి లేదా...?" ఆమె కళ్ళు కోపంగా చూస్తున్నాయి. చెంపలు ఎర్రబడుతున్నాయి.

"నీకు మేల్ ఇగో, ఇన్‌సెక్యూరిటీ చాలా ఉంది. నేనెవడితో తిరుగుతానో అని నీ భయం... అక్కడిదాకా వస్తే నీకు చెప్పే చేస్తా..."

"మనుషుల్ని సొంతం చేసుకుంటే కానీ, మన అనిపించుకునే ఓ గ్యారంటీ పత్రం తీసుకుంటే కానీ శాంతి లేదా...?" ఆమె కళ్ళు కోపంగా చూస్తున్నాయి. చెంపలు ఎర్రబడుతున్నాయి. "నీకు మేల్ ఇగో, ఇన్‌సెక్యూరిటీ చాలా ఉంది. నేనెవడితో తిరుగుతానో అని నీ భయం... అక్కడిదాకా వస్తే నీకు చెప్పే చేస్తా..."

దెబ్బతిన్నట్టుగా చూశా...

నా భాషలో నాది ఇంటెన్సిటీ... షీర్ అబ్సెషన్.

"నిన్నే నా ప్రపంచం చేసుకోవాలనుకుంటున్నావా? అయినా మిస్సవటంలో దాహం ఉంటుంది, ప్రేమ ఉంటుంది... కోపం కాదు. అద్దంలో చూసుకోపోవోయ్..."

నిజంగా ఇగోనేనా?

మగతనం... మగతనం... సమాజం కోసం మగాడనే పనికిమాలిన నిర్వచనంలో ఒదిగిపోవడానికి ఇబ్బందులు పడుతూ.. జీవితాన్ని ఆనందించే శక్తిని కోల్పోతున్న మగవాడు... స్వేచ్ఛగా ప్రపంచాన్ని ఏలాలనుకుంటున్న స్త్రీతో కలిసి ఉండడానికి, జీవితాన్ని నిర్మించుకోడానికి ఎంత సంఘర్షణ పడాలి? ఇగో, అబ్సెషన్, ప్రేమ... వీటిని ఎవడు డిఫైన్ చేయాలి?

• • •

రాత్రి పదయింది. సెంట్రల్ కోర్ట్‌లో చిన్న గేదరింగ్.

యాడ్ వర్క్ పూర్తయింది. క్లయింట్ ఫార్మాలిటీస్, డిన్నర్ అన్నీ పూర్తి చేసుకుని బయటపడ్డాను... డిసెంబర్ నెల చలి వణికిస్తోంది.

నీలూ ఎక్కడుందో?

తూ హోగా జరా పాగల్...

ద నెంబర్ యు ఆర్ ట్రయింగ్ టు రీచ్ ఈజ్...

ఇంటికొచ్చి డోర్ ఓపెన్ చేశాను.

చిక్కటి చీకటి... లోపలా, బయటా.

"కొంచెం ఎక్కువా కాదు, కొంచెం తక్కువా కాదు... దానికో కొలతుంటుంది. ఎంత ప్రేమించాలో, ఎలా ప్రేమించాలో, పెదవులెపుడు కలవాలో, చేతులెపుడు పెనవేసుకోవాలో... దానికో పద్ధతుంటుంది. ప్రేమ పెరక్కుండా, మోహం బరువు కాకుండా జాగ్రత్తపడాలి. రోజుక్కొంచెంగా ఇష్టాన్ని చంపేసుకోవాలి."

రచయిత సెల్ : 84980 84024

ఎం దు కు...?



ఆడవాళ్లకు బట్టతల ఎందుకు రాదు?



ప్రస్తుత కాలంలో సగటు పురుషుణ్ని వేధిస్తున్న సమస్య బట్టతల. 'మాకే ఎందుకొస్తుంది.. ఆడవాళ్లకు ఎందుకు రాదు?' అని చాలామంది పురుషులు లోలోపల మథనపడుతుంటారు కూడా. దానికి కారణం పురుషుల్లో లైంగికతను ప్రేరేపించే టెస్టోస్టిరాన్ హార్మోన్ నుంచి డీ హైడ్రోటెస్టోస్టిరాన్ హార్మోన్ ఉత్పత్తి కావడమే. ఇది వెంట్రుకల పెరుగుదలను నియంత్రిస్తుంది. స్త్రీలతో పోలిస్తే పురుషుల వెంట్రుకల పొడవు తక్కువగా ఉండడానికి కారణం కూడా ఇదే. చాలాసార్లు ఇది వంశపారంపర్యంగా వస్తుంది. ఈ హార్మోన్ ఎక్కువగా విడుదలయ్యే వారిలో వెంట్రుకల పెరుగుదల తక్కువగా ఉండటమే కాక ఉన్నవి కూడా ఊడిపోతాయి. స్త్రీలలో ఈ హార్మోన్ చాలా తక్కువగా ఉంటుంది కనుక వాళ్లకు చాలా అరుదుగా మాత్రమే బట్టతల వస్తుంటుంది.

పేగులు ఎందుకు అరుస్తాయి?



బాగా ఆకలిగా ఉన్నప్పుడు కడుపులో చిన్న చిన్న శబ్దాలు రావడం అందరికీ అనుభవమే. కడుపు ఖాళీ అయినప్పుడు ఆకలిని ప్రేరేపించే రసాయనాలను విడుదల చేయాలంటూ జీర్ణకోశానికి మెదడు సంకేతాలిస్తుంది. ఆ రసాయనాలను స్వీకరించడానికి వీలుగా సంకోచించాలని, వాటిని ముందుకు వెనక్కు కదిలించాలని కూడా పెద్దపేగుకు సిగ్నల్ ఇస్తుంది. ఆ సమయంలో పేగుల్లో ఉండే గాలి, ఈ రసాయనాలు ఒకదానికొకటి తగిలినప్పుడు చిన్న చిన్న శబ్దాలు వెలువడుతాయి. వాటినే మనం 'కడుపులో ఎలుకలు పరిగెడుతున్నాయి' అంటుంటాం.

రికార్డింగ్‌లో మన గొంతు తేడాగా ఎందుకుంటుంది?



మనం మాట్లాడినప్పుడు మనకు వినిపించే మాటలు ఒక రకంగా ఉంటే, రికార్డ్ చేసుకొని విన్నప్పుడు మరోలా ఉంటాయి. దీనికి కారణం ఏమిటంటే.. మనం మాట్లాడే మాటలు స్వరపేటిక ద్వారా మెదడుకు చాలా వేగంగా చేరుతాయి. అప్పుడు ఇందులో ఇతర శబ్దాలు వచ్చి చేరే అవకాశాలు తక్కువ. కానీ, రికార్డ్ చేసినప్పుడు మన మాటలు గాలిలోని ఇతర శబ్దాలతో కలిసి నమోదవుతాయి కనుక అవి మరోలా వినిపిస్తాయి. ■



మ్యాచింగ్ మ్యాచింగ్...

అతని పేరు ఎడ్ గార్గిలా(Ed Gargiula), వయసు 76 సంవత్సరాలు.

ఆమె పేరు ఫ్రాన్ (Fran), వయసు 74 సంవత్సరాలు.

వారిది 52 ఏళ్ల దాంపత్యం. అందులో విశేషమేముంది?


మన దేశంలో అంతకంటే ఎక్కువ సంవత్సరాలే కలిసి ఉన్న జంటలు ఎందరో ఉన్నారు.

వీరిలో విశేషమేంటంటే 52 ఏళ్లుగా వీరు ఒకే రకమైన వస్త్రధారణ చేస్తున్నారు.

వేసుకునే వస్త్రాలు మాత్రమే కాదు చేసే పనుల లోనూ అంతే! ఏ పనైనా ఇద్దరూ కలిసే చేస్తారు. సినిమాకెళ్లినా, షికారుకెళ్లినా, మార్కెట్‌కి వెళ్లినా కలిసే వెళ్తారు.

52 ఏళ్లుగా ప్రతిరోజూ ఒకేలా డ్రెస్సింగ్ అంటే బోర్ కొట్టదా.. అని ఒక విలేకరి అడిగిన ప్రశ్నకు "ఆమె నుంచి నేను వేరుగా లేను అనే అనుభూతిని ఈ వస్త్రాలు కలిగిస్తాయి. మనం వేసుకునే వస్త్రాలు మన వ్యక్తిత్వాన్ని తెలుపుతాయంటారు సైకాలజిస్టులు కానీ మేము మాత్రం మా ప్రేమను తెలిపేందుకు ఇలా ఒకే రకమైన వస్త్రాలను వేసుకుంటున్నాం. దీన్ని నేనెప్పటికీ వదులుకోవడానికి ఇష్టపడను" అంటాడు గార్గిలా.

వీరి మనవడు ఆంటోని గార్గిలా(Anthony Gargiula) ట్విట్టర్‌లో చేసిన పోస్టు ద్వారా వీరి గురించి ప్రపంచానికి తెలిసింది. ■




కొత్త పుస్తకాలు

పదునైన కథలు

